

## తిరుమల,తిరుపతిలో వేడుకగా ఆండాళ్ తిరువడిపురం శాత్తుమొర

తిరుపతి, జులై 22ప్రభాతవార్త: శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి తిరుమలలో, తిరుపతిలో శ్రీదేవిభూదేవి గోవిందరాజస్వామి తిరుపతిలో పురుశైవారితోటకు వేంచేపుచేశారు. ఇక్కడ వేదోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు తిరిగి ఊరేగింపుగా తిరుచ్చిపై ఆలయానికి చేరుకున్నారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త


## ప్రయోగానికి సిద్ధమైన

# పిఎస్ఎల్‌వి సి-56 రాకెట్

**- పిఐఎఫ్ నుంచి లాంచ్ ప్యాడ్‌కు తరలిన రాకెట్**






అనుసంధాన భవనం వద్ద రాకెట్, పిఎస్ఎల్‌వి సి-56 రాకెట్‌ను అనుసంధానం చేస్తున్న దృశ్యం

శ్రీహరికోట (తడ), జూలై 22 ప్రభాతవార్త

శ్రీహరికోటలో మరో రాకెట్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. ఈ నెల 30న ప్రయోగించనున్న పిఎస్ఎల్‌వి సి-56ను ప్రయోగ వేదికకు తరలించారు. షార్‌లో నూతనంగా నిర్మించిన పిఎస్ఎల్‌వి ఇంటిగ్రేషన్ ఫెసిలిటి (పిఐఎఫ్) భవనం నుంచి మొదటి ప్రయోగ వేదికకు రాకెట్‌ను తీసుకొచ్చారు. ప్రస్తుతం ఫస్ట్ లాంచ్ ప్యాడ్ మీద నాలుగు దశల పిఎస్ఎల్‌వి సిద్ధంగా ఉంది. దీని పైభాగాన ఏడు సింగపూర్ ఉపగ్రహాలను అమర్చి రాకెట్‌ను ప్రయోగానికి సిద్ధం చేస్తారు. ఇది పక్కా కమర్షియల్ ప్రయోగం. అటు సింగపూర్ శాస్త్రవేత్తలు, ఇటు ఇస్రో శాస్త్రవేత్తలు శ్రీహరికోటలోనే ఉండి ప్రయోగ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. డిఎస్-ఎస్ఎఆర్ ప్రధాన ఉపగ్రహం కాగా, మరో మూడు ఉపగ్రహాలు, ఇంకో మూడు నానో ఉపగ్రహాలను ఈ రాకెట్ అంతరిక్షంలోని 535 కిలోమీటర్ల లో ఎర్త్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టాల్సి ఉంది. సింగపూర్ దేశానికి సంబంధించిన అంతరిక్ష కక్ష్యను చేరుకోవడానికి అనుకూలమైన సమయం ఉదయం పూట కావడంతో రాకెట్ ప్రయోగాన్ని ఉదయం 6.30 గంటలకు జరపనున్నారు.

# ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు !



**-సెప్టెంబర్ 17నుండి సాలకట్ల బ్రహ్మోత్సవాలు**

**-అక్టోబర్ 14నుండి నవరాత్రి బ్రహ్మోత్సవాలు**

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

ఆపదమొక్కులవాడు శ్రీవేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది అధికమాసం రావడంతో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు టిటిడి నిర్వహించనుంది. అధికమాసంలో సాధారణంగా సెప్టెంబర్‌మాసంలో జరిగే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలు రెండువారాల తేడాతో జరిపించేలా ముహూర్తం ఖరారుచేస్తారు. దేశం నలుమూలల నుండి లక్షలాదిమంది భక్తులు తరలివచ్చి వాహనసేవలను వీక్షించి పునీతులవుతారు. తొమ్మిదిరోజులు రోజుకు రెండు వాహనాలపై ఎంతో ముగ్ధమనోహరంగా, సర్వాలంకార భూషితుడై శ్రీవేంకటేశ్వరుని ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత శ్రీమలయప్పస్వామివారు ఒక్కో వాహనంపై ఒక్కో విశిష్టతతో ఊరేగి భక్తులను కటాక్షించడం ప్రత్యేకత. ఈ ఏడాది సెప్టెంబర్ 17వతేదీ నుంచి 26వరకు ,తిరిగి అక్టోబర్ 14నుండి 23వతేదీ వరకు కన్నులపండువగా బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాలకు తేదీలు ఖరారుచేశారు. ఉదయం పూట వాహనసేవలు 8గంటలకే మొదలవుతాయి. రాత్రి వేళ వాహనసేవలు 7గంటలకు ఆరంభవుతాయి. వార్షిక బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 17వతేదీ ఆదివారం సాయంత్రం అంకురార్పణం, 18న సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవ ఘట్టానికి శ్రీకారంపడుతుంది. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు రద్దుచేస్తారు.సామాన్యభక్తులకు ఎక్కువగా దర్శనసమయం కల్పించేందుకు ఆ తొమ్మిదిరోజులు బ్రేక్ దర్శనాలు ఉండవు. టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి సారధ్యంలో దేవదేవుని బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

## ఉద్యమాలతో ప్రజలకు

# అండగా నిలిచిన పార్టీ సీపీఐ

**సీపీఐ జాతీయకార్యదర్శి కె.నారాయణ**



నగరి, జూలై 22 ప్రభాతవార్త:

ఉద్యమాలతో ప్రజలకు అండగా నిలిచిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సీపీఐ జాతీయకార్యదర్శి కె.నారాయణ అన్నారు. శనివారం నగరి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయాన్ని నగరి నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి ఉపయోగించుకోవడంతో పాటు అట్టడుగు బడుగు బలహీన వర్గాల వారు చిన్నపాటి ఫంక్షన్లు జరుపుకోవడానికి పార్టీ కార్యాలయం, ఉపయోగపడే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. మొన్న మణిపూర్‌లోజరిగినటువంటి సంఘటనతో మోదీ ప్రభుత్వం తల దించుకోవాలని విమర్శించారు. నూతన కార్యాలయానికి కామ్రేడ్ వసుమతిదేవి పేరును నామకరణ చేశారు. ఆమె ఆశయాలకు తగ్గట్టు కొనసాగించాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామానాయుడు ఎర్రజెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ఎం.శ్రీరాములు, నగరి, తిరుపతి, చిత్తూరు, పుత్తూరు నియోజకవర్గాల కార్యదర్శులు టి.కోదండయ్య, గోపినాథ్, డి.మహేష్, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే మంచి సమాజం ఏర్పడుతుంది

## సెమ్ 2 పుస్తకాలను పంపిణీ చేసిన కలెక్టర్



విద్యార్థులకు సెమ్ 2 పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటరమణా రెడ్డి

తిరుచానూరు, జులై 22, ప్రభాతవార్త

పాఠశాల విద్యార్థిని విద్యార్థులు చదువు మీద శ్రద్ధ పెట్టి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇచ్చి అన్ని సదుపాయాలు కల్పిస్తున్న నేపథ్యంలో బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణ రెడ్డి ఆకాంక్షిస్తూ 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు సెమ్ 2 పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ శనివారం నాటికి జిల్లాలోని అన్ని పాఠశాలలో 6 నుండి 9 తరగతుల విద్యార్థిని విద్యార్థులకు సెమ్ 2 పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయాలని పాఠశాల విద్య కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం స్థానిక తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందలి ఆరు నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు కలెక్టర్ డీఈఓ డా. వి. శేఖర్‌తో కలిసి సెమ్ 2 పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని విద్యలో రాణించి సమాజానికి మంచి పౌరులుగా ఎదగాలని వారు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో వినూత్నమైన మార్పులు తెచ్చిందని ప్రతి బడి ఈడు పిల్లవాడు బడిలో ఉండేలా జగనన్న అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, బై జ్యూస్ ట్యాబ్‌ల పంపిణీ తదితర విద్యా సంబంధిత అనేక కార్యక్రమాలు చేపట్టి విద్యకు ప్రాధాన్యతనిస్తూ నేటి బాలలే రేపటి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేలా పాఠశాల రూపురేఖలు నాడు నేడు కింద మార్చి ఎన్నో విద్యాభివృద్ధి కార్యక్రమాలు విద్యార్థినీ విద్యార్థుల భవిష్యత్తు కొరకు చేపడుతోందని, ఈ అవకాశాలని ప్రతి ఒక్క విద్యార్థి వినియోగించుకుని విద్యను ఇష్టంతో అభ్యసించాలని తద్వారా మంచి సమాజం ఏర్పడుతుందని పిల్లలకు హితవు పలికారు.

## శ్రీసిటీని సందర్శించిన రాష్ట్ర చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

సత్యవేదు, జూలై 22,ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి కె. సునీత, ఐఎఎస్, శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఆమెకు సాధర స్వాగతం పలికారు. ఆమె ఎంతో ఆసక్తితో శ్రీసిటీ అభివృద్ధి ప్రగతి ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా ఆమె టోరే పరిశ్రమను సందర్శించారు. టోరే మేనేజింగ్ డైరెక్టర్ , సిఈఓ మసాహిరో, నిషిజావా ఆమెను పరిశ్రమ లోపలికి తీసుకుని వెళ్ళి తయారీ విధానాన్ని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సహాయం, సహకారం పట్ల సంతృప్తి చెందుతున్నారా అంటూ ఈసందర్భంగా ఆమె వారిని ఆరా తీయగా, పరిశ్రమ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. అనంతరం శ్రీసిటీ పరిశ్రమల సిఈఓ లతో ఆమె సమావేశమై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వివరించి, రాష్ట్రంలో సులభతర వ్యాపారం పట్ల వారి అభిప్రాయాలను కోరారు. శ్రీసిటీ మేనేజ్‌మెంట్ ద్వారా వారి అభిప్రాయాలు, సూచనలను క్రోడీకరించి అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. శ్రీసిటీని సందర్శించినందుకు ప్రిన్సిపల్ సెక్రటరీకి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## వాలంటీర్ల వ్యవస్థను ప్రశ్నించలేదు..తప్పులు చేస్తున్న వారిని ప్రశ్నిస్తున్నాం..

**-మాజీ మంత్రి అమరనాథరెడ్డి**

పలమనేరు, జూలై 22,ప్రభాతవార్త:



వాలంటీర్ల వ్యవస్థను ఎవ్వరు ప్రశ్నించలేదని కొంత మంది వాలంటీర్ల చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తే ప్రభుత్వం దారిమళ్ళించే ప్రయత్నం చేస్తు ఇలాంటి చర్య లు చేపడుతుందని మాజీ మం త్రి అమరనాథరెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వాలంటీరు వ్యవస్థను ప్రశ్నించలేదని అందులో కొంత మంది వాలంటీర్లు చేస్తున్న తప్పులు,అక్రమాలను ప్రశ్నిస్తుంటే ప్రభుత్వం వారి తప్పులను కప్పిపుచ్చుకోవటం కోసం తప్పుడు ప్రచారాలు చేస్తు విమర్శలు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. టిడిపి వాలంటీర్లకు వ్యతిరేకం కాదని అవినీతికి అక్రమాలకు లొంగని వాలంటీర్లను తాము అధికారం లోకి వస్తే కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.ప్రజలలో అభివృద్ధిపై ప్రశ్నలు అధికమౌతున్న తరుణంలో ప్రభుత్వం ప్రజలను తప్పుదారిపట్టించేందుకు ఇలాంటి చర్యలు చేపడుతుందన్నారు. ఈనెల 28 నుండి పలమనేరు నియోజకవర్గంలో ఇంటింటికి తెలుగు దేశం కార క్రమం ప్రారంభిస్తునట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వం ద్వారా ఎదుర్కొంటున్న సమస్యలు,టిడిపి మినీ మెనిఫెస్టోలపై అవగాహన చేపట్టనున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామచంద్రా నాయుడు,నాయకులు ఆర్‌వి బాలాజీ,కిషోర్ గౌడ్,సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యాలకు అధునాతన పద్ధతులు అవలంభించాలి

**ఆలయాల వద్ద భక్తులకు ఉచిత అన్నప్రసాదం సదుపాయం కల్పించాలి**

**అంతర్జాతీయ దేవాలయాల సమ్మేళనంలో టిటిడి ఇఒ ధర్మారెడ్డి**



తిరుమల,జులై 22ప్రభాతవార్తప్రతినిధి:

ఆలయ నిర్వాహకుల ధృడ నిశ్చయం, లక్ష్యం, చిత్తశుద్ధి, భక్తిదేవాలయాల పరిపాలన అభివృద్ధికి ఖచ్చితంగా ఉపయోగపడతాయని టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి పేర్కొన్నారు. ఆలయాలు అభివృద్ధి జరగాలంటే సమీప ప్రాంతంలో ఉన్న ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని, ఆలయాలలో భక్తుల సౌకర్యాల కల్పనకు అధునాతన పద్ధతులు అవలంభించాలని సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని, ఆలయాల వద్ద భక్తులకు ఉచితంగా అన్నప్రసాదం పంపిణీ జరగాలన్నారు. ఉత్తరప్రదేశ్‌రాష్ట్రంలోని వారణాసి రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడురోజుల పాటు అంతర్జాతీయ దేవాలయాల సమ్మేళనం శనివారం ప్రారంభమైంది. 30దేశాలకు చెందిన వివిధ హిందూ దేవాలయాల 1600మంది నిర్వాహకులు హాజరైన ఈ సదస్సుకు టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా టిటిడి 71 ఆలయాలను నిర్వహిస్తోందని, తిరుమల దేవునికి 1.2టన్నులకిలోల బంగారు ఆభరణాలు, 10టన్నుల వెండి ఆభరణాలు అలంకరిస్తామన్నారు. 17వేల కోట్లరూపాయలు బ్యాంకుల్లో డిపాజిట్ చేయగా, 11టన్నులు బంగారాన్ని డిపాజిట్ చేశామన్నారు. శ్రీవారికి ఏడాదికి 500టన్నుల పుష్పాలతో అలంకరణ చేస్తామన్నారు. ఆలయంలో భక్తులకు సేవలందించడానికి రోజుకు 800మంది ఉద్యోగులు విధుల్లో ఉంటారన్నారు. తిరుమల ఆలయంలో ప్రసాదాల తయారీకి ఏడాదికి 500టన్నుల నెయ్యిని వినియోగిస్తున్నట్లు ఇఒ ధర్మారెడ్డి వివరించారు. టిటిడిలో 2000వ సంవత్సరంలో ప్రారంభించిన శ్రీవారి సేవకు ఇప్పటివరకు 14లక్షలమంది సేవకులు నమోదయ్యారన్నారు.

## తిరుపతిలో పార్టీని బలోపేతం చేయండి

**-శ్రేణులకు కేంద్రమంత్రి నిర్దేశం**




తిరుపతి(విద్య), జులై 22ప్రభాతవార్త:

తిరుపతి జిల్లాలో పార్టీని బలోపేతం చేసుకునే దిశగా నాయకులు,కార్యకర్తలు పనిచేయాలని కేంద్రమంత్రి కపిల్‌మోరేశ్వర్‌పాటిల్ దిశానిర్దేశం చేశారు. శనివారం రాత్రి తిరుపతికి విచ్చేసిన ఆయనకు తిరుపతి బిజెపి జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథరెడ్డి, నాయకులు పాటిబండ మురళి, విజయకుమార్, కవిత, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దీప్‌క్‌యాదవ్,షేక్‌మాలిక్, రవి పుష్పగుచ్చంతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

# కాణిపాకం ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ పదవికోసం పైరవీలు

**-గణనాధుని ఆశీస్సులు ఎవరికి దక్కేనో?**

కాణిపాకం, జూలై 22 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ పదవికోసం అధికార వైకాపాకు చెందిన పలువురు నాయకులు గత కొద్ది రోజులుగా తీవ్రస్థాయిలో పైరవీలు సాగిస్తున్నారు. కాణిపాకం ఆలయం జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో ఒకటిగా దినదినాభివృద్ధి చెందుతోంది. ఈనేపథ్యంలో ప్రతిష్టాత్మకమైన ఆలయ ఛైర్మన్ పదవి ఎలాగైన దక్కి ంచుకోవాలని అధికార పార్టీకి చెందిన ఉభయదారులు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. 2018 ఆగస్టు 3న అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సురేంద్రబాబు ఛైర్మన్‌గా రెండేళ్ళ కాలపరిమితితో ఏర్పాటైన ట్రస్ట్‌బోర్డు ఏడాది కూడా పూర్తి కాకుండానే టీడీపీ అధికారం కోల్పోవడంతో ట్రస్ట్ బోర్డు పదవీకాలం అర్థాంతరంగా ముగిసింది.అనంతరం స్థానికేతురాలైన పెనుమూరు మండలం పులికల్లుకు చెందిన మహాసముద్రం ప్రమీలమ్మరెడ్డిని కాణిపాకం ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్‌పర్సన్‌ను ప్రభుత్వం నియమించింది. అయితే ప్రమీలరెడ్డి నియామకంపై ఆలయ ఉభయదారుల నుండి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యకం అయింది, ఒక దశలో ఆలయ పాలక మండలి ఛైర్మన్ పదవి ఆలయ ఉభయదారులకే కేటాయించాలనే డిమాండుతో స్థానికులు, ఆలయ ఉభయదారులు రాజకీయాలకు అతీతంగా ఆందోళన చేపట్టడంతో ప్రభుత్వం దిగివచ్చి ఆలయ ఉభయదారులకే ఛైర్మన్ పదవిని కేటాయించింది. ఈనేపథ్యంలో 2021 అక్టోబర్‌లో స్థానిక ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడిగా వున్న అగరంపల్లె మోహన్‌రెడ్డిని ఆలయ ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఈయన పదవీ కాలం అక్టోబర్ 2తో ముగియనుంది. దీనితో ఛైర్మన్ పదవిని



ఈదఫా ఎలాగైన దక్కించుకోవాలని అధికార పార్టీకి చెందిన ఆలయ ఉభయదారులు గత కొద్ది రోజులుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఆలయ ఛైర్మన్‌గా వున్న మోహన్‌రెడ్డి తిరిగి తన పదవీకాలాన్ని మరో రెండేళ్ళు పొడిగించుకోవాలని తనకున్న పలుకుబడితో తీవ్రస్థాయి ప్రయత్నాలు సాగిస్తున్నారు. తన హయాలో దేవస్థానంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి తన పదవీ కాలాన్ని మరోమారు పొడిగించాలని మోహన్‌రెడ్డి కోరుతున్నారు. అయితే ఆలయ సర్వతోముఖాభివృద్ధికి ఎంతో కృషిచేసిన ఆలయ ఉభయదారులను, ఉభయదారుల వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఏకపక్షంగా విధానాలను అవలంభిస్తున్న ఆలయ ఈఓ చర్యలను సమర్తిస్తూ ఆయనను వెనకేసుకొస్తున్న ఛైర్మన్‌పై ఉభయదారుల్లో తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అలాగే గ్రామ పంచాయతీని ఆర్థికంగా దెబ్బతీసే విధంగా చర్యలకు ఉపక్రమించిన ఈఓకు మద్దతు పలుకుతున్న మోహన్‌రెడ్డి పట్ల గ్రామ ప్రజలు సైతం వ్యతిరేక భావం చూపుతున్నారు. ఈనేపథ్యంలో అధికార పార్టీకి చెందిన ఉభయదారులు జయచంద్రారెడ్డి అలియాస్ చిన్నారెడ్డి ఆలయ ఛైర్మన్ పదవిని ఎలాగైన దక్కించుకోవాలని గత కొద్ది రోజులుగా తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆలయ అభివృద్ధి కోసం తన పూర్వీకుల నుండి ఎంతో కృషి చేశామని కావున ఆలయ ఛైర్మన్ పదవిని తనకు కేటాయించాలని ఆలయ ఉభయదారులు, స్థానికులు, గ్రామస్థులను వెంటబెట్టుకుని గత రెండుమూడు రోజులు క్రితం స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబును కలసి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్,పలువురు గ్రామస్థులు, ఆలయ ఉభయదారులను వెంట బెట్టుకుని ఎమ్మెల్యేను కలసి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఒక సారి మోహన్‌రెడ్డికి ఛైర్మన్ పదవిని కేటాయిచినందున ఈదఫా తమకు కేటాయించాలని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈనేపథ్యంలో ఖచ్చితంగా ఛైర్మన్ పదవి తనకే వస్తుందని చిన్నారెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రస్తుత ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఛైర్మన్ పదవిని ఆశిస్తున్న చిన్నారెడ్డిలు తమ తమ స్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇదిలా వుండగా గతంలో ఎస్సీలకు కేటాయించిన ఛైర్మన్ పదవిని ఇతరులకు కేటాయించినందున ఈదఫానైనా తమకు కేటాయించాలని ఎస్సీ దళిత ఉభయదారులు డిమాండు చేస్తున్నారు.

## కుప్పంలో అందుబాటులోని జియో ఫైబర్ సేవలు

కుప్పంరూరల్, జూలై 22 ప్రభాతవార్త



కుప్పం మున్సిపాలిటీ పరిధిలో జియో ఫైబర్ సేవలను త్వరలో పూర్తిస్థాయిలో అందుబాటులో తెస్తున్నట్లు మంజునాథ కేబుల్ నెట్‌వర్క్ ఛైర్మన్ నందకుమార్, ఎండి అవినాష్ తెలిపారు. శనివారం జియో ఫైబర్ సేవలను స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్దగల జియో టవర్ నుంచి ప్రారంభించారు. జియో ఫైబర్ సేవలను కుప్పం పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ విజయ్, శీను, సూర్య, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కుప్పంరూరల్, జూలై 22 ప్రభాతవార్త



మండలంలోని మల్లానూరు రైల్వే స్టేషన్ వద్ద ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. మృతుడికి సుమారు 55 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. మృతుడు పసుపు రంగు టీ షర్టు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహంను గుర్తించిన వారు కుప్పం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

## చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత ఏ వైకాపా నేతకు లేదు

– తెదేపా నేతలు

కుప్పంరూరల్, జూలై 22 ప్రభాతవార్త



తెదేపా అధినేత చంద్రబాబునాయుడు గురించి మాట్లాడే అర్హత స్థానికంగా ఉన్న, బయటనుంచి వచ్చే వైకాపా నేతలకు లేదని మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2019 ఎన్నికల సమయంలో కుప్పం వచ్చిన ఎమ్మెల్సీ భరత్‌కు కుప్పంలో చంద్రబాబు చేసిన అభివృద్ధి గురించి ఏం తెలుసని ప్రశ్నించారు. కేవలం 2014-19 సం॥ల మధ్య కుప్పంలో 2500కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందనే విషయం తెలుసుకోవాలన్నారు. అంతకుముందే గ్రామ గ్రామానికి స్కూళ్లు, రోడ్లు, కుప్పంలో పరిశ్రమల ఏర్పాటు, వివిధ అభివృద్ధి పనులు చేశారన్నారు. గడపగడపకు కార్యక్రమంలో పల్లెలు తిరుగుతున్న భరత్‌కు అవి చంద్రబాబు వేసిన రోడ్లు అని తెలియదా అంటూ ప్రశ్నించారు. అయ ్యప్ప దీక్షలో ఉన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌లు అయ్యప్పమాల చేతపట్టుకుని కుప్పానికి చంద్రబాబు ఏం చేయలేదని చెప్పగలరా అని ప్రశ్నించారు. కుప్పంలో ప్రజల సంపద దోస్తూ అరాచకాలు, దౌర్జన్యాలు ఎవరు చేస్తున్నారో ప్రజలకు తెలుసన్నారు. కరోనా సమయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున ఆక్సిజన్ పాంట్లు, ప్రజలకు ఆహారాన్ని అందించామని ఆ విషయం మరచిపోయారా అని వ్యాఖ్యలు చేశారు. కుప్పానికి వైకాపా చేసింది చెబితే నవ్వు వస్తుందన్నారు. కుప్పం మున్సిపల్ ఎని ్నకల్లో అధికారులతో బెదిరించి గెలిచిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా కుప్పంలో చంద్రబాబు లక్ష మెజార్టీతో గెలవడం తథ్యమన్నారు. సమావేశంలో రాష్ట్ర యువత నేత చెక్కునత్తం మణి, తెలుగుమహిళ నేత సుగుణమ్మ, తెలుగుయువత నేతలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి కృషి తప్పనిసరి

చంద్రగిరి సర్పంచ్ ముద్దికుప్పం రూప రామమూర్తి

చ ంద్రగిరి, జూలై 22 ప్రభాతవార్త:



పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి కృషి తప్పనిసరి అని సర్పంచ్ ముద్దికుప్పం రూప రామమూర్తి అన్నారు. స్థానిక శ్రీ పద్మావతీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఎంఈఓ శ్రీవరం లలితకుమారి అధ్యక్షతన 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ టెక్ట్ ్స బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిధిగా విచ్చేసిన సర్పంచ్ తన పుట్టిన రోజును పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటి నీరుపోశారు. అదేవిధంగా విద్యార్థినులకు విద్యా సామగ్రిని వితరణ చేశారు. పర్యావరణ పరిరక్షణతో మనందరి జీవితాలు ముడిపడివున్నట్లు తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రతి విద్యార్థి గుర్తుంచుకుని ఉజ్వల భవిష్యత్తు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, హెచ్ఎం వెంకటరమణారెడ్డి, ఎస్ఎంసి ఛైర్మన్ రుక్మిణీ, వార్డు సభ్యురాలు జ్యోతి ప్రసన్న, టీచర్లు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## సంక్షేమ పథకాలకు రారాజు సీఎం జగన్

– సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి, జూలై 22 ప్రభాతవార్త



సంక్షేమ పథకాలు కొనసాగించడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎవరూ సాటిరారని, సంక్షేమ పథకాలకు రారాజు జగన్‌మోహన్‌రెడ్డి అని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం ఓజిలి మండలం ఆరిమేనుపాడు సచివాలయంలో జడ్పీటీసీ సభ్యులు గుంటమడుగు రవీంద్రరాజు ఆధ్వర్యంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు భారీ గజమాలతో మంగళ వాయిద్యాలతో కర్పూర హారతులతో ఘనస్వాగతం పలికారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమం దిగ్విజయంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఎమ్మెల్యే సంజీవయ్య, జడ్పీటీసీ సభ్యులు రవీంద్రరాజు చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. రైతుభరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ నూతన భవనాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. తహశీల్దార్ శివరామ సుబ్బయ్య, ఎంపిడిఓ రజనీకాంత్, ఉపసర్పంచ్ వైసీపీ సీనియర్ నాయకులు సుకుమార్‌రాజు, ఎంఇఓ శైలజ, కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్‌బాషా, ఎంపిటిసి సభ్యులు రఘురామరాజు, నాయుడుపేట సిఐ వైవీ సోమయ్య, ఓజిలి ఎస్ఐ డి.ఆదిలక్ష్మి, సర్పంచ్ ముప్పాళ్ల మాధవీలత, తిరుపతి పోలయ్య, సుకుమార్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పాదర్తి హరినాథరెడ్డి, ఎపిఎం నిర్మల, ఎపిఎం ఉషారాణి, ఎంపిటిసి రఘురామరాజు, శంకు మహేంద్ర, అగ్రికల్చర్ ఏఇ విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యంరాజు, ఈశ్వరరాజు, రామచంద్రరాజు, తిరుమలపూడి సర్పంచ్ యాకసిరి గోపాలయ్య, విఆర్ఓ తిరుపాలయ్య, ఎంఇఓ చంద్రశేఖర్, అజమతుల్లా, పంచాయతీ కార్యదర్శులు పెద్ద మస్తానయ్య, భూదేవి, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఓడిపోతుందన్న భయంతోనే టీడీపీ నేతలపై ఆరోపణలు

– మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జులై 22, ప్రభాతవార్త:



వైసీపీ ప్రభుత్వం ఓడిపోతుందన్న భయంతోనే సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్టీఆర్ కుటుంబసభ్యులపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పవన్‌కళ్యాణ్ ఎన్ని పెళ్ళిళ్ళు చేసుకుంటే జగన్‌కు ఎందుకని, దమ్ముంటే ఆయన కూడా చేసుకోవచ్చు అని తెలిపారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటనలో అధికారులు, నాయకులు విచ్చలవిడిగా వ్యవహరించారని తెలిపారు. పచ్చని చెట్లను నరికి వేశారని తెలిపారు. 2024 సంవత్సరం ఎన్నికల్లో వైసీపీని ప్రజలు చిత్తుగా ఓడిస్తారని చెప్పారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నరసింహయాదవ్ మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డికి చంద్రబాబునాయుడుని విమర్శించే స్థాయి లేదని తెలిపారు. మహిళల పట్ల కూడా అసభ్యకరంగా సీఎం ఆరోపణ చేస్తున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి జి.నాగేశ్వరరావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ పి.రాజేశ్వరరావు, నాయకులు గంగాధర్, చంద్రమౌళిరెడ్డి, రాయి మస్తాన్‌నాయుడు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంకా అందని రేషన్

– ఆందోళనలో రేషన్ కార్డుదారులు

కోట, జూలై 22 ప్రభాతవార్త

కోట మండలంలోని 2500 రేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయలేదు. ఈ విషయంపై ప్రభుత్వం సర్వర్ నిలిపేసిందని, తామేమీ చేయలేమని ఎండియు ఆపరేటర్లు చేతులెత్తేస్తున్నారు. ఆ మేరకు కార్డుదారుల నుంచి ఒత్తిడిని భరించలేక ఎండియు ఆపరేటర్లు శనివారం డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జునరావుకు తమ ఆవేదన తెలియజేశారు. ఈ నెల 21తో ప్రభుత్వం సర్వర్ నిలిపేసిందని, దీంతో తాము 2500 రేషన్‌కార్డులకు బియ్యం ఇవ్వలేకపోయామని చెప్పారు. ఆపరేటర్లు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా, అల్లూరు సీతారామరాజు జిల్లా, నంద్యాల జిల్లాలో అధికారులు సర్వర్ ఇప్పించారని, ఇక్కడ కూడా సర్వర్ ఇప్పించాలని కోరారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని డిటి మల్లికార్జునరావు తెలిపారు.

## జగనన్న సురక్ష ద్వారా 310 ధృవీకరణ పత్రాలు జారీ

పలమనేరు,జూలై 22,ప్రభాతవార్త:



పలమనేరు పట్టణంలోని ఎద్దులసంత సచివాలయ పరిధిలోని లబ్ధిదారులకు జగనన్న సురక్ష ద్వారా 310 ధృవీకరణ పత్రాలను శనివారం జారీ చేశారు.ఈ సందర్భంగా వార్డు సచివాలయ కన్వీనర్,కౌన్సిలర్ కోదండ రామయ్య మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా ఉచితంగా ప్రజలకు 310 ధృవీకరణ పత్రాలను అందించడం జరిగిందన్నారు.ప్రభుత్వ సంక్షేమాల నమోదుకు కావలసిన ధృవీకరణ ప్రతాలను ఈ సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డా॥ బిఆర్ సురేష్‌బాబు

కుప్పం, జూలై 22 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డా॥ బిఆర్ సురేష్‌బాబును నియమిసూ ్త రాష్ట్ర పార ్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా కుప్పం నియోజకవర ్గంలో పార్టీ విస్తరణ విభాగం కన్వీనర్‌గా సైతం డా॥ సురేష్‌బాబును నియమించారు. డా॥ సురేష్‌బాబు గత నెలలో తెదేపా అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో కాంగ్రెస్‌ను వీడి తన అనుచరులతో తెదేపాలో చేరిన విషయం విదితమే. ఈనేపథ్యంలో డా॥ సురేష్‌బాబుకు అధినేత చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్రస్థాయి కార్యవర్గంలో చోటు కల్పించారు. దీనిపై దేశం శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

## అభివృద్ధి.. సంక్షేమం సిఎం జగనన్నతోనే సాధ్యం

– మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

కుప్పం, జూలై 22 ప్రభాతవార్త



రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సిఎం జగనన్నతోనే సాధ్యమని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. శనివారం 16,17వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్బంగా ఛైర్మన్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేసిన ఘనత సిఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజలకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. ప్రజలు కూడా తమకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రిని మరోమారు ఆదరించాలని కోరారు. ఈసందర్భంగా ఎక్కువ సర్టిఫికెట్లు నమోదు చేసిన వాలంటీర్లు తిరుమలదేవి, ప్రమీల, కాంచన, దివ్యభారతిలకు నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆర్. రంగయ ్య, ఆంజనేయ గుడి ఛైర్మన్ కుమరేష్, మున్సిపల్ అధికార ప్రతినిధి ఇంతియాజ్, కో కన్వీనర్ జయశంకర్, కార్యదర్శి తాండవ కృష్ణ, విఆర్వో శ్రీకాంత్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణంకు 50వేల విరాళం

కుప్పం, జూలై 22 ప్రభాతవార్త



మండలంలోని కంగుంది గ్రామంలో వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణంకు రాష్ట్ర వాల్మీకి కార్పోరేషన్ డైరెక్టర్ నాగభూషణమ్మ సుబ్బరాజులు యాభైవేల రూపాయల విరాళంను అందించుటకు ముందుకొచ్చారు. శనివారం రూ 50101రూ.ల నగదును గ్రామంలోని వాల్మీకి కులస్తులకు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ఈశ్వర్, శాంతిపురం జడ్పీటిసి శ్రీనివాసులు, నేతలు జయపాల్, బాబు, రాజు, శీనప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చంద్రబాబు తరపున పదివేల ఆర్థికసాయం

శాంతిపురం, జూలై 22 ప్రభాతవార్త

మండలంలోని బోయనపల్లికి చెందిన రఘుపతిస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. ఇతని మృతి పట్ల తెదేపా అధినేత చంద్రబాబునాయుడు సంతాపం వ్యక్తం చేశారు. తనవంతుగా బాధిత కుటుంబానికి పదివేల సాయం ప్రకటించారు. ఈనగదును దేశం నేతలు మృతుడి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో నేతలు ఉదయ్‌కుమార్, జనార్ధనరెడ్డి, ఎల్. జయరాంరెడ్డి, రమేష్, రాజారెడ్డి, కేశవులు, రామకృష్ణ, మురళి, ఆనందనాయుడు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదవాలి

కోట, జూలై 22 ప్రభాతవార్త



పేద విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని చెందోడు గ్రామ వైసీపీ నాయకుడు, సర్పంచ్ దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, మాధవీలత కోరారు. శనివారం మండలంలోని చెందోడు గ్రామ యూపీ స్కూలులో పాఠ్య పుస్తకాలను నాగూర్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. నాడు-నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేయడం, అమ్మఒడి, గోరుముద్ద, జగనన్న వసతిదీవెన, విద్యాదీవెన, ఫీజు రీయంబర్స్‌మెంట్ వంటి అనేక పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## త్వరలో సర్పంచుల ఛలో ఢిల్లీ

– వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్

కోట, జూలై 22 ప్రభాతవార్త

గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించలేని విధంగా సర్పంచులను వైసీపీ ప్రభుత్వం దిష్టిబొమ్మల్లా చేసిందని కోట మండలం వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్ ఆరోపించారు. ఆయన శనివారం విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘం నిధుల్లో 10 వేల కోట్లను కరెంటు ఛార్జీల పేరుతో పంచాయతీ ఖాతాల నుంచి వెనక్కి లాగేసుకుందన్నారు. దీంతో పారిశుధ్య పనులు, సాగునీరు, వీధిదీపాల మరమ్మతులు చేపట్టలేక సర్పంచులు ప్రజలకు ముఖం చూపించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 24న 15 రకాల డిమాండ్లతో అన్ని జిల్లాల కలెక్టర్లకు సర్పంచులు వినతిపత్రం అందజేస్తున్నట్లు తెలిపారు. పార్లమెంటులో వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడంతో సర్పంచులతో కలిసి ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఇంటింటా ఓటరు సర్వేకు ఇక్కట్లు

కోట, జూలై 22 ప్రభాతవార్త

ఇంటింటా ఓటరు జాబితా సర్వేకు సవాలక్ష సమస్యలు ఎదురవుతున్నాయి. సర్వర్ నెమ్మదించడంతో యాప్ పనిచేయడం లేదు. పనిచేసినా అందులో ఉండే జాబితాకు బిఎల్ఓ వద్ద ఉన్న పాత ఓటరు జాబితాకు పొంతన కుదరడం లేదు. ఈ నెల 21 నుంచి బిఎల్ఓలు ఓటరు, ఆధార్ చరవాణి నంబర్లు తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉండటంతో అభ్యంతరాలకు సంబంధించి ఇరుగు పొరుగు వారు సమాచారం ఇవ్వకపోవడం, ఓటరు పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసే అవకాశం లేకపోవడం వంటి సమస్యలతో మొదటిరోజు సర్వేకు అడుగడుగునా ఆటంకాలు ఎదురయ్యాయని పలువురు బిఎల్ఓలు చెప్పారు.

## జగనన్న విద్యాకానుకలో పుస్తకాలు పంపిణీ

తడ, జూలై 22 ప్రభాతవార్త



జగనన్న విద్యాకానుకలో భాగంగా తడ మండలం తడకండ్రిగలో శనివారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. సర్పంచ్ తుమ్మా జయప్రద, ఉపాధ్యాయులు కలిసి ఎంపియుపి స్కూలు, బోడిలింగాలపాడులోని ప్రాథమిక పాఠశాల వద్ద సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు శశికుమార్, వైస్ సర్పంచ్ అఫ్రిది, పంచాయతీ సభ్యులు షణ్ముగం, ప్రధానోపాధ్యాయులు సురేంద్రబాబు, మంజుల, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తడకండ్రిగ, కారూరులలో ఓటరు జాబితా సర్వే

– సక్రమంగా ఓటరు జాబితా తయారు చేయాలని ఆర్డీఓ ఆదేశాలు

తడ, జూలై 22 ప్రభాతవార్త

తడ మండలం తడకండ్రిగ, కారూరు గ్రామాల్లో శనివారం సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని ఓటరు జాబితా సర్వేను పరిశీలించారు. ఈ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాను సక్రమంగా తయారు చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, అలసత్వం ప్రదర్శించకుండా విధులు నిర్వహించాలన్నారు. ఆర్డీఓ వెంట తహశీల్దార్ కటారి జయజయరావు తదితరులు ఉన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఉపాధి పనులు తనిఖీచేసిన డ్వామా పీడీ గంగా భవాని

వెదురుకుప్పం, జూలై 22 ప్రభాతవార్త :



మండలంలో జరుగుతున్న మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామి పథకం పనులను శనివారం డ్వామా పీడీ గంగా భవాని తనిఖీ చేశారు. మండలంలోని మాంబేడు, టికెయం.పురం పంచాయితీ పరిధిలో జరిగిన ఉపాధి పనుల తనిఖీలో భాగంగా అమృత సరోవర్, మాడిమి, కొబ్బరి తోటల పెంపకం పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనల మేరకు పనులు చేపట్టాలని నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు చేయాలని చూచించారు. కూలీలతో మాట్లాడి పనులు నిర్వహిస్తున్న ప్రాంతంలో అవసరమైన త్రాగునీరు సౌకర్యంతో పాటు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుతున్నారని ప్రశ్నించారు. కూలీ గిట్టుబాటు ధర వస్తుందని తెలుసుకున్నారు.కూలీల సంఖ్య పెంచాలని ఉపాధి సిబ్బందని ఆదేశించారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో కూలీలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం తోటలు పెంపకం చేపట్టిన రైతులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకుని తోటల పెంపకం, తీసుకువలసిన జాగ్రత్తలు తెలియాజేశారు. ఆమెతో పాటు ఏపీవో ఇందు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టు పురుగుల పెంపకంతో అధిక ఆదాయం

: పట్టు పరిశ్రమ శాఖ సహాయ సంచాలకులు మోహన్ బాబు

వెదురుకుప్పం, జూలై 22 ప్రభాతవార్త :



పట్టు పురుగుల పెంపకంతో అధిక ఆదాయం రైతులకు సమకూరుతుందని పట్టు పరిశ్రమ శాఖ సహాయ సంచాలకులు మోహన్ బాబు పేర్కొన్నారు. మండలంలోని వెదురుకుప్పం, పెరుమాళ్ళపల్లె సచివాలయాల పరిధిలో రైతు బరోసా కేంద్రాలలో రాష్ట్రీయ కృషి వికాష్ యోజన పథకంలో భాగంగా డాక్టర్ వైఎస్ఆర్ పట్టుబడి కార్యక్రమం పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ కూలీలు, తక్కువ కూలీలతో అధిక ఆదాయం పొందడంకు పట్టు పెంపకం చక్కటి మార్గమని చెప్పారు. పాత పద్దతులలో పురుగుల పెంపకం కష్టంగా ఉండేదని ఆధునిక పద్దతుల్లో పెంపకం వలన రైతులు సులభంగా సాఫ్టువేర్ ఉద్యోగులా అధిక మొత్తంలో సంపాదించవచ్చన్నారు. రైతులు పట్టు పెంపకంకు ఆశక్తితో ముందుకు వస్తే ప్రభుత్వం రాయితీలు అందజేస్తుందన్నారు. పట్టు మొక్కల నాటడం కొరకు ఎకరంకు 18750 రూపాయా చొప్పున అందిస్తుందన్నారు. అలాగే పెంపకం కొరకు షేడ్డు నిర్మాణాలకు 225000 నుంచి మూడు లక్షల వరకు రుణం అందిస్తుందన్నారు. మండల స్థాయిలో ఆశక్తిగల రైతులు రైతు బరోసా కేంద్రంలోని సిరికల్చర్ సహాయకులను సంప్రదించాలని చెప్పారు. అనంతరం క్షేత్ర స్థాయిలో మల్బరీ తోటలను సందర్శించి రైతులకు పట్టు పురుగుల పెంపకంలో తీసుకోవలసిన మెలుకువలు, జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శశిఆనంద రెడ్డి, మండల వ్యవసాయాధికారిణి వనిత, ఏఎస్వో గణేష్, టిఏ జయచంద్ర, సిరికల్చర్ అసిస్టెంట్ ఈశ్వర్ రెడ్డి, శరవణ, హేమాద్రి,వ్యవసాయ సహాయకులు దయాకర్,రైతులు వెంకటేష్, గోవింద రెడ్డి, విజయశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న కర్నాటక మంత్రి

కాణిపాకం, జూలై 22 ప్రభాతవార్త:



కర్నాటక రాష్ట్ర మంత్రి ఎంసీ సుధాకర్ శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్, నాయకులు చిన్నారెడ్డి, ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరెండెంట్ రంగస్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యలకు పరిష్కారం

– ఓజిలి తహశీల్దార్ శివరామసుబ్బయ్య

ఓజిలి, జూలై 22 ప్రభాతవార్త

ఏళ్ల తరబడి కాగితాలకు పరిమితమైన భూములను రైతుల పేరుతో హక్కు కల్పించడానికి ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సాదాబైనామా, వారసత్వ, ముటేషన్ పెండింగ్‌లో ఉన్న వివాద రహిత పొలాలను రైతుల పేరుతో రికార్డులను ఏర్పాటు చేయడానికి ఓజిలి మండలంలో సోమవారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ శివరామ సుబ్బయ్య తెలిపారు. జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిఎల్ఆర్ ద్వారా మండలంలోని 22 గ్రామాలకు రీసర్వే వివిధ దశలలో జరుగుతుందని తహశీల్దార్ తెలిపారు. రీ సర్వే ప్రారంభం కాని రెవెన్యూ విలేజిలలో ప్రీ పిఎల్ఆర్ నిర్వహించి వివాదాలు లేని పొలాల రైతులకు ఉచితంగా హక్కులు కల్పిస్తామని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గోపిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోట మండలంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ

కోట,జులై 22 ప్రభాతవార్త



కోట మండలంలోని అన్ని పాఠశాలలకు సెంకడ్ సెమ్ ప్యాఠ పుస్తకాలను శనివారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంపిణీ చేయడం జరిగిందిని మండల విద్యాశాఖధికారి 2 మస్తానయ్య తెలిపారు. ఆమేరకు కోట, తిన్నెలపూడి, చెందోడు, లింగాలస్వామి టెంపుల్,జరుగుమల్లి, ఎస్.ఎల్.జి, పాఠశాలల్లో పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆయా గ్రామాల్లో విద్యాకమిటి ఛైర్మన్లు, సర్పంచులు పంపిణీ చేశారని ఆయన పేర్కొన్నారు.పాఠ్యపుస్తకాల తో పాటు నోడ్సులను కూడా అంద చేయడం జరిగిందన్నారు.

## దుద్దు ప్రభాకర్‌ను అరెస్టు చేయడంపై



కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు నిరసన

చిల్లకూరు, జులై 22, ప్రభాతవార్త

రాష్ట్ర కుల నిర్మూలన పోరాట సమితి అధ్యక్షులు దుద్దు ప్రభాకర్‌ని ఎన్ఐఎ బృందం శుక్రవారం విజయవాడలో ప్రభాకర్ నివాసంలో అరెస్టు చేయడం హేయనీయమైన చర్య అని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కావలి బాలయ్య అన్నారు. శనివారం ఏరూరు గ్రామంలో నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు వ్యతిరేకంగా ఈ దేశ సంపదను విదేశాలకు తాకట్టు పెడుతున్న కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు అక్రమ కేసులు పెట్టి జైలులో పెట్టి నిర్భందించడం సరైన పద్ధతి కాదన్నారు. భారత పౌరుడిగా అక్రమాల గురించి మాట్లాడినందు కోసం ఎంతటికైనా ఒడికడుతున్నటువంటి కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్నామన్నారు. దేశంలో , రాష్ట్రంలో ప్రజ్ఞాశాలి వాదనపై పెట్టిన ఉపా కేసులు ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పోలయ్య, కార్యకర్తలు సురేంద్ర, వెంకి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో రీ సర్వే ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

తిరుపతి కలెక్టర్, జులై 22, ప్రభాతవార్త

జిల్లాలో రీ సర్వే ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె. బాలాజీ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సర్వే డీటిలతో రీ సర్వే, మ్యూటేషన్ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన రీసర్వే ప్రక్రియలో భాగంగా జిల్లాలో రోజు వారి ప్రణాళికతో సర్వేను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రీ సర్వేకు సంబంధించి భూముల హద్దులకు సంబంధించిన ప్రతి అప్పీల్‌కు స్పీకింగ్ ఆర్డర్‌ను స్పష్టంగా రైతులకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మ్యూటేషన్స్‌కు సంబంధించిన దరకాస్తులను బియాండ్ ఎస్ఎల్ఎకు వెళ్లకుండా గడువులోపు పూర్తి చేయాలని తెలిపారు. రీ సర్వే పూర్తయిన గ్రామాలలో తప్పనిసరిగా గ్రామ సభ ఏర్పాటు చేసేలా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడి సర్వేయర్ జయరాజ్, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల సమస్యలపై రేపు కలెక్టర్‌కు వినతి

**విజయపురం, జూలై 22 ప్రభాతవార్త:** రేపు సోమవారం ఉదయం 10 గంటలకు చిత్తూరులో సర్పంచ్‌ల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించడానికి జిల్లాలోని సర్పంచ్‌లు తరలి రావాలని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చుక్కా ధనంజయయాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల నుంచి తీసుకున్న నగదును తమ ఖాతాలో జమ చేయండి అంటూ నిరసన వ్యక్తం చేసే కార్యక్రమం జరుగుతుందని, పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు తరలి రావాలని పిలుపునిచ్చారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..ఎంఎల్ఏ



**తొట్టంబేడు, జూలై 22 ప్రభాతవార్త** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యులు బియ్యపుమధుసూధన్‌రెడ్డి అన్నారు. శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తొట్టంబేడు-2 సచివాలయం పరిధిలోని సాయిబాబా గుడి, ఎల్ఏసి కాలనీ, చిలకావారికండ్రిగ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ముందుగా ఆయన షిరిడిసాయినాధుని ఆలయంలో వెలసిన సాయినాధుని దర్శించుకున్నారు. అనంతరం ఎంఎల్ఏకు క్రేన్ ద్వారా భారీ గజమాలతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎంపిపి ఉన్నంనిర్మల, వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు, సర్పంచ్ సుబ్బయ్యలు స్వాగతం పలికారు. అనంతరం ఎంఎల్ఏ ఇంటింటికి వెళ్ళి జగనన్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అలాగే అర్హత ఉండి పథకాలు అందని లబ్దిదారులకు వెంటనే ఈపథకాలు అందేందుకు జగనన్న సురక్ష పథకాన్ని సిఎం ప్రవేశపెట్టారని దీన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకోసం నిరంతరం తాను, తన కుమార్తె అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి చంద్రయ్యనాయుడు, రమణయ్యనాయుడు, భాస్కర్, కన్నలిభాస్కర్‌రెడ్డి, అద్దంకిడాంగే, సందీప్‌రెడ్డి, వెంకటరమణనాయుడు, ధర్మయ్య, గంగాధరం, గిరి, మణినాయుడు, వినోద్, మాబాష, వెంకటేశ్వర్లునాయుడు, కత్తినాగరాజు, మణి, రఘురామ, తహశీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపిడిఓ సురేష్‌బాబు, ఇఓపిఆర్‌డి తరుణాక్షరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# శివయ్య సేవలో బిజెపి ఎంఎల్ఏ



**శ్రీకాళహస్తి,జూలై 22 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరుని సేవలో శనివారం బెంగుళూరుకుచెందిన ఎంఎల్ఏ పాల్గొన్నారు. బెంగుళూరు ఎంఎల్ఏ,మాజీ వ్యవసాయశాఖమంత్రి (రాజేశ్వరినగర్) మునిరత్నం కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు.వారికి దక్షిణ గోపురం వద్ద బిజెపి నాయకులు స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లును టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్ పర్యవేక్షించగా బిజెపి నాయకుడు చందూరాయల్ పాల్గొన్నారు.వారికి మృత్యుంజయ ఆలయం ఎదురుగా వేదపండితులు ప్రభాకర్ శర్మ ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందించారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి

శ్రీకాళహస్తిరూరల్, జూలై 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మోహనమ్మ(55) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ పోలీసులు శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిలేడుకు చెందిన మోహనమ్మ(55) మోటార్‌సైకిల్‌పై శ్రీకాళహస్తికి వస్తుండగా ఊరందూరు గ్రామం వద్ద గుర్తుతెలియని కారు డీకొంది, గాయపడిన మోహనమ్మను ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు.అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు సిఐ అజయ్‌కుమార్ వివరించారు.

# శివయ్య సన్నిధిలో ఫ్రీడం ఆయిల్ సిఈవో

శ్రీకాళహస్తి, జూలై 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం ఫ్రీడం ఆయిల్ సిఈవో చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబసభ్యులతో విచ్చేశారు. ఈసందర్భంగా వీరికి ఆలయంలోని దక్షిణగోపురం వద్ద స్థానిక ఫ్రీడం ఆయిల్ డీలర్, అయ్యప్పజనరల్‌స్టోర్ నిర్వాహకులు రాజ, ఆలయాధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంలో స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనం చేసుకుని పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వీరికి ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలు అందించి వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు.

# అన్నమయ్య గొప్ప సామాజిక సంస్కర్త

-శ్రీసిటీ సాహిత్య సదస్సులో భూమన్ వ్యాఖ్య

సత్యవేడు, జూలై 22,ప్రభాతవార్త:

ప్రముఖ కవి, తెలుగు పదకవితా పితామహుడు శ్రీతాళ్ళపాక అన్నమాచార్యులు 15వ శతాబ్దంలోని ఓగొప్ప సామాజిక సంస్కర్త అంటూ శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ అన్నారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం ఉదయం శ్రీసిటీలో 'అన్నమయ్య-సామాజికత' అనే అంశంపై భూమన్ ప్రసంగం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భూమన్ ప్రసంగిస్తూ సామాజిక దృక్పథం గురించి, ఆయన సంకీర్తనల ద్వారా సమాజంలోని ప్రజలందరి సమానత్వం కొరకు ఎలా ప్రచారం చేశారో వివరించారు. సంగీత సాహిత్యాలను మేళవించి సూక్తి రత్నాలను అందించిన వాగ్గేయకారులలో అన్నమయ్య అగ్రగణ్యులని భూమన్ వ్యాఖ్యానించారు. సుమారు 32వేల పద కవితలు రాసి, ఆలపించి పదకవితా పితామహుడిగా వినుతికెక్కారన్నారు. శ్రీవాణి వేదిక అన్నమయ్య సామాజిక కీర్తనలకు ప్రాధాన్యత ఇస్తూ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టడాన్ని అభినందించారు. భూమన్‌తోపాటు టీటీడి అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన విశిష్ట కళాకారులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికి సత్కరించారు. శ్రీసిటీలో స్థానిక కళాకారులను ప్రోత్సహిస్తూ సాహిత్య, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం యొక్క ఉద్దేశ్యాన్ని ఆయన వివరించారు.

# రాజకీయంగా మాదిగలకు న్యాయం చేయకుంటే సత్తాచాటుతాం

-మాదిగ జెఎసి



తిరుపతి,జులై 22ప్రభాతవార్త:

జనాభా ప్రాతిపదికన అంతే శాతం రిజర్వేషన్‌తో ఎంపి,ఎమ్మెల్యే సీట్లను రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని మాదిగల జెఎసి డిమాండ్ చేసింది. గత ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరుజిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఒక్కటే మాదిగలకు తగిన న్యాయం చేసి, చిత్తూరు ఎంపి, పూతలపట్టు ఎమ్మెల్యే సీట్లు కేటాయించిందన్నారు. 2024 ఎన్నికల్లో తమకు తగిన సీట్లు కేటాయించకుంటే తమ సత్తా చూపెడతామని మాదిగ జెఎసి రాజకీయపార్టీలను హెచ్చరించింది. శనివారం తిరుపతిలోని ఆంబేద్కర్ భవన్‌లో మాదిగ జెఎసి ఛైర్మన్ పి.సుబ్బయ్య అధ్యక్షతన అఖిలపక్షం సమావేశం జరిగింది. కాంగ్రెస్, టిడిపి, జనసేన పార్టీలకు చెందిన,ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని 15మాదిగ సంఘాల నాయకులు కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి విభాగం రాష్ట్ర కోఛైర్మన్ గౌడపేరు చిట్టిబాబు ,మాదిగ మహాజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, విశ్రాంత ఉద్యోగుల సంఘం కోశాధికారి టి.దాస్, పిసి స్వామి, అంబేద్కర్ భవన్ ఉపాధ్యక్షుడు మాసారపు గోపి, నాయకులు తమతమ ప్రసంగాల్లో తమకు రాజకీయంగా న్యాయం కావాలని కోరారు.

# ఓటర్ల సర్వేను సకాలంలో పద్ధతి ప్రకారం చేపట్టాలి



కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, జులై 22, ప్రభాతవార్త

ఓటర్ల సర్వేను సకాలంలో పద్ధతి ప్రకారం చేపట్టాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్, తిరుపతి నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి హరిత అధికారులకు సూచనలు జారీ చేశారు. తిరుపతి నియోజకవర్గం ఎమ్మార్ పల్లె 20వ డివిజన్లోని వాసవినగర్‌లో శనివారం తిరుపతి నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, తిరుపతి అర్బన్ ఎంఆర్‌ఓతో కలిసి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న బిఎల్‌ఓలతో కలిసి ఓటర్ల పరిశీలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హరిత బిఎల్‌ఓలకు సూచనలు చేస్తూ ప్రతి ఇంటింటికి వెళ్లి ఆ ఇంట్లో వారి ఓటర్ల వివరాలను మన దగ్గరున్న ఓటర్ లిస్ట్‌తో సరి చూసుకోవాలని, 18 సంవత్సరాలు నిండిన వారు ఆ ఇంట్లో వుంటె, వారిని ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. అదే ఇంట్లో ఓటరుగా వుండి మృతి చెందిన ఓటరుని తొలగించాలన్నారు. ( ఓటర్ల నమోదులో గాని, తీసి వేయడంలో గాని అవకతవకులు జరిగితే చట్ట ప్రకారం కఠిన చర్యలు గురి కావల్సి వస్తుందని కమిషనర్ హరిత హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట తిరుపతి అర్బన్ ఎంఆర్‌ఓ వెంకటరమణ, డిప్యూటీ తహశీల్దార్ జీవన్, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

# శ్మశానవాటికల నిర్వహణ చక్కగా ఉండాలి

కమిషనర్ హరిత



తిరుపతి కార్పొరేషన్, జులై 22, ప్రభాతవార్త

తిరుపతి నగరంలోని శ్మశాన వాటికల నిర్వహణ కూడా చక్కడా వుండాలని సూచిస్తూ శనివారం బాలాజీ కాలనీ వద్ద నున్న శ్మశానవాటికను కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లతో కలిసి పరిశీలించారు. అదే విధంగా తుడా నిధులు 95 లక్షలతో బాలాజీ కాలనీ శ్మశానవాటికలో గ్యాస్‌తో నిర్మించిన శవదహన నిర్మాణాలను ఇటీవలే నగర పాలక సంస్థకు అప్పగించడంతో ఆ నిర్మాణాలను పరిశీలిస్తూ మెరుగైన చర్యలకు కమిషనర్ హరిత సూచనలు జారీ చేస్తూ, శ్మశానంలోకి శవదహన కార్యక్రమాలకు వచ్చే ప్రజల కోసం అవసరమైన నీటి వసతి, టాయిలెట్స్ సౌకర్యం ఉండేలా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. గ్యాస్‌తో దహనక్రియలు నిర్వహించేందుకు అన్ని పనులు పూర్తి చేసే త్వరలో అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. శ్మశాన వాటికల్లో శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్తా చెదారాన్ని తొలగించాలని, కంపచెట్లు పెరగకుండా ఎప్పటికప్పుడు తొలగించేలా సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్ డిఈ రవీంద్ర రెడ్డి, డివిజన్ నాయకులు మోహన్, బాబ్జిలు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీటీసీపై చర్యలు తీసుకోండి



**రేణిగుంట, జూలై 22 ప్రభాతవార్త:** తూకివాకం మాజీ ఎంపీటీసీపై చర్యలు తీసుకోవాలని తూకివాకం పంచాయతీకి చెందిన కొంత మంది ఎస్సీ యువకులు ఎస్సీ నాయకురాలు అరుణదేవి ఆధ్వర్యంలో ఆరోపించారు. రేణిగుంట రూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎంపీటీసీ కులం పేరుతో దూషించాలన్నారు. ఈ మేరకు రేణిగుంట డీఎస్పీకి ఫిర్యాదు చేయగా ఫిర్యాదును రూరల్ సీఐకి రెఫర్ చేశారన్నారు. ఫిర్యాదు అందుకున్న రూరల్ సీఐ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు. తనకు న్యాయం జరగకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బాధితుడు విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకురాలు అరుణదేవి, బాధితుడు రమేష్, పలువురు దళిత యువకులు పాల్గొన్నారు. కులం పేరుతో దూషించలేదు తాను ఎవరిని కులం పేరుతో దూషించలేదని మాజీ ఎంపీటీసీ ప్రభాతవార్త ప్రతినిధికి వివరణ ఇచ్చారు.

# దేశంలో గిరిజనులకు రక్షణ లేదా...సీపీఎం ఆవేదన

**రేణిగుంట, జూలై 22 ప్రభాతవార్త:** భారతదేశంలో గిరిజనులకు రక్షణ లేకుండా పోయిందని సీపీఎం పార్టీ నాయకులు అనుబంధ సంస్థల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించినందుకు నిరసన వ్యక్తం చేస్తూ సీపీఎం నేతలు రేణిగుంట పట్టణంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ సీఎం వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని, కేంద్ర హోం శాఖ మంత్రి తక్షణం స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు దిలీప్ బాషా, రాజశేఖర్, నరసింహారెడ్డి, వెంకటరమణ, మండల కార్యదర్శి హరినాథ్, ఐద్వా నాయకులు సత్యశ్రీ, ఈశ్వరమ్మ, సుజాత, ధరణి, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మేనమామ జగన్మోహన్‌రెడ్డి



**రేణిగుంట, జూలై 22 ప్రభాతవార్త:** ప్రపంచానికి చంద్రుడు మామ అయితే విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులకు మేనమామ అయ్యారని విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మిపతిరెడ్డి అన్నారు. విప్పమానుపట్టెడ గ్రామ పంచాయతీ వేమాపురం సంజీవరెడ్డి కాలనీ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో జగనన్న విద్యా కానుకలో భాగంగా శనివారం బడి పిల్లలందరికి రెండో సెమిస్టర్ టెక్ట్స్, వర్క్ పుస్తకాలను లక్ష్మిపతిరెడ్డి పంపిణీ చేశారు.

# సర్పంచ్‌కు చెవిరెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

చంద్రగిరి, జూలై 22 ప్రభాతవార్త:



చంద్రగిరి సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం వైసిపి ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పంచాయతీ కార్యాలయానికి చేరుకుని సర్పంచ్ దంపతులను దుశ్శాలువతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాహిత కార్యక్రమాలతో, ప్రజా సేవలో మరింత మమేకమై మెరుగైన ప్రజాభిమానం సాధించాలని అభినందించారు. అంతకుముందు పంచాయతీ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, వైసిపి విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు సూరి, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# జగనన్న సురక్షతో 1275 సర్టిఫికెట్లు

జగనన్న పాలన స్వర్ణయుగం

వైసిపి ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



**చంద్రగిరి, జూలై 22 ప్రభాతవార్త:** ప్రతిష్టాత్మక జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా దరఖాస్తు చేసుకున్న 1275 సర్టిఫికెట్లు ఉచితంగా మంజూరు చేసినట్లు వైసిపి ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రాయలపురం, కందులవారిపల్లిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ జగనన్న పాలన స్వర్ణయుగమని కొనియాడారు. బడుగు బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత మన సిఎంకే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల పౌర సేవలు ఉచితంగా అందించడమే ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. పౌర సేవల కొరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ప్రభుత్వ పథకాలను తమ ఇంటి వద్దే అందించడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, సర్పంచ్‌లు వెంకటపతి, భాస్కర్ రెడ్డి, ఎంపిడిఓ రమేష్‌బాబు, డిప్యూటీ తహశీల్దార్ అమృత, ఈఓఆర్‌డి శశిరేఖ, ఏపిఓ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత ఆశయంతోనే జగనన్న సురక్ష



-స్వర్ణ యుగాన్ని తలపిస్తున్న జగన్న పాలన

-ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతిరూరల్, జూలై22 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత ఆశయంతో అర్హత కలిగిన ప్రతి లబ్దిదారుడికి సంక్షేమం అందాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. శనివారం పెరుమాళ్ళపల్లి, సాయినగర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయా ప్రాంతాలలో అర్హత కలిగిన లబ్దిదారులకు ఉచిత సర్టిఫికేట్స్‌ను అందజేసారు. అనంతరం మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ సి.యం. జగన్ పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందించే వివిధ రకాల సేవలు, సర్టిఫికేట్స్ కోసం కార్యాలయాలు చుట్టూ తిరగకుండా, అవసరమైన సర్టిఫికేట్స్ ఇళ్ల ముంగిటకే అందిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రజా సేవకై నిరంతరంగా పరితపిస్తున్నాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ళపల్లి గ్రామ సర్పంచ్ జోగి మోహన్‌కుమార్, వైకాపా నేత కొత్తపాటి మునీశ్వరరెడ్డి,ఎంపిడిఓవెంకటనారాయణ, పంచాయతీ కార్యధర్శి మదుసూధన్ తదితరులు పాల్గొన్నారు

# పవన్ వ్యక్తిగత విషయాలపై మాట్లాడడం సిగ్గుచేటు

**శ్రీకాళహస్తి, జూలై 22 ప్రభాతవార్త** సిఎం హోదాలో ఉన్న వ్యక్తి ప్రజా విధానాలపై కాకుండా జనసేనాని పవన్ వ్యక్తిగత విషయాలపై మాట్లాడడం సిగ్గుచేటనీ జనసేన పార్టీ శ్రీకాళహస్తి





నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోట దుయ్యబట్టారు. శనివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సిఎం హోదాలో ఉన్న వ్యక్తి ప్రజా విధానాలపై కాకుండా జనసేనాని పవన్ వ్యక్తిగత విషయాలపై మాట్లాడడం సిగ్గుచేటనీ, ఇకనైనా ఇలాంటివి మానుకోవాలని హితవు పలికారు. వెంకటగిరిసభలో నేతన్న నేస్తం సభలో సిఎం జగన్ ప్రజా విధానాలపై కాకుండా తమ అధినేత పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా వైసిపి పార్టీ సేకరిస్తున్న సమాచారం ఎక్కడికి వెళ్తుంది? డేటా ఎక్కడ స్టోర్ చేస్తున్నారు. ఈ వ్యవస్థకి ఎవరు అధిపతి వారు తప్పుచేస్తే బాధ్యత ఎవరు వహిస్తారని వారి ద్వారా ప్రజలకు సంబందించిన సెన్సిటివ్ డేటా కొంత మంది నేరగాళ్ళకు వెళ్తుందన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఇబ్బంది కలుగుతుందని మాట్లాడితే, రాష్ట్ర ముఖ్యమంత్రి సమాధానం చెప్పలేక పవన్ వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడి ఎదురుదాడి చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి అందరికీ ఆదర్శంగా ఉండాలే కానీ దిగరాజరుడు రాజకీయాలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొట్టేసాయిప్రసాద్, కుమార్, దండిరాఘవయ్య, గోపి, కిరణ్‌కుమార్, శివకుమార్, మునికుమార్, గణేష్, మాధవమహేష్, నితీష్‌కుమార్, వెంకటరమణ, చిరంజీవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మా భూమిలో చొరబాట్లు ఆపించండి

శ్రీకాళహస్తి, జూలై 22 ప్రభాతవార్త

అత్తామామలతో పాటు భర్తనూ కోల్పోయా.. తన ఇద్దరు బిడ్డలకు అండగా ఉంటుందనుకుంటున్న



మూడు ఎకరాల డికెటి భూమిలో కొందరు చొరబాట్లకు దిగుతున్నారు. అన్ని విధాల పోరాడి అలసిపోయిన తమకు ప్రభుత్వం అండగా నిలవాలని, తమ ఆస్తికి రక్షణ కల్పించాలంటూ మండలంలోని గుంటకిందపల్లి గ్రామానికి చెందిన మల్లాంసునంద ఆవేదన వ్యక్తం చేసింది. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన మామ మల్లంసుబ్బరామయ్య పేరుతో గుంటకిందపల్లి గ్రామ దాఖలా సర్వే నంబర్ 8/1లో 2.95 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని దీనికి 1996లో పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేశారన్నారు. ఈభూమిలో ఆయన ఆరుతడి పంటలు పండిచేవారని అయితే వీరికి తెలియకుండానే రెవెన్యూ అధికారులు పట్టణానికి చెందిన వెంకటేష్ భార్యలు ఏలూరుదేవి, ఏలూరు పరమేశ్వరి పేరున దొంగపట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేశారనాన్నరు.దీనిపై సుబ్బరామయ్య అధికారులు చుట్టు తిరిగి మానసికంగా కుంగిపోయి 2013లో మరణించాడని కన్నీటి పర్యంతం అయ్యింది. అనంతరం 2017లో సుబ్బరామయ్య సతీమణి రామమ్మ మృతిచెందగా తన భర్త కృష్ణమూర్తి 2021లో కరోనా వ్యాధి బారినపడి మృతిచెందాడన్నారు. ఈసమస్యలపై పలుమార్లు కలెక్టర్, ఆర్డీవోకు పిర్యాదుచేశానని బాధితురాలు వాపోయింది. శ్రీకాళహస్తి తహశీల్దార్ స్పందించి వీఆర్‌ఓ, ఆర్‌ఐను పిలిపించి ఇరు వర్గాలను విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని విచారణ పూర్తయ్యే వరకు ఇరువర్గాలు పొలంలోకి ప్రవేశించరాదని ఆదేశించారన్నారు. అయితే గత రెండు నెలలుగా వెంకటేష్ కుటుంబసభ్యులు తమపొలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి అక్రమ కట్టడాలు చేపడుతున్నట్లు వాపోయారు. దీనిపై రెవెన్యూఅధికారులకు పిర్యాదుచేసినా ఫలితం లేదని బిసి కుటుంబానికి చెందిన వారికి ఎస్సీల పేరిట పట్టాలు ఎలా ఇస్తారని సునంద ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

# నటుడు యోగిబాబును కలసిన నగరి ఫోటోగ్రాఫర్లు

**నగరి, జూలై 22 ప్రభాతవార్త:** ప్రముఖ తమిళ హాస్య నటుడు యోగిబాబుకు నగరి ఫోటోగ్రాఫర్లు అసోసియేషన్ సభ్యులు శనివారం చెన్నైలోని ఆయన నివాసంలోకలిశారు. ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. హీరో ప్రభాస్‌తోకలసి నటించే తెలుగు చిత్రం ద్వారా తెలుగు సినిమా రంగంలోకి అడుగిడుతున్నట్లు యోగిబాబు వారికి తెలియజేశారు.

# తిరుపతి డివిజన్

## కార్వేటినగరం టిటిడి ఆలయంలో అన్నదానం

కార్వేటినగరం, జూలై 22 ప్రభాతవార్త:

తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కార్వేటినగరంలో నిర్వహిస్తున్న శ్రీరుక్మిణీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విరాళదాతగా గంగాధరనెల్లూరుకు చెందిన దీపక్‌కుమార్ భక్తులకు అన్నదానం చేశారు. సుమారు 100మంది అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయాధికారి సురేష్‌కుమార్, టిటిడి సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల సమస్య పరిష్కరించడమే జగనన్న సురక్ష

వైకాపా సినియర్ నాయకులు రామ్‌ప్రసాద్‌రెడ్డి



నింద్ర, జూలై 22 ప్రభాతవార్త : పేద ప్రజల సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం ప్రవేశపెట్టినట్లు వైకాపా సినియర్ నాయకులు రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని నేట్టేరి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో వైకాపా సినియర్ నాయకులు రామ్‌ప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో ప్రజలు ఆర్‌కె రోజాకి రెండుసార్లు అవకాశము ఇచ్చారని అదే ప్రకారం 2024వ సంవత్సరంలో వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా గెలిపించి రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి ఆర్‌కె రోజాను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మీకష్టాలు చూసారని వాటి పరిష్కరించడానికి మొదటి నుంచి పరిష్కరించే విధంగా అనేక సంక్షేమ పథకాలు తీసుకొని వచ్చి ఆదుకుంటావుండారని తెలిపారు. 2014వ సంవత్సరంలో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు 600 హామీలు ఇచ్చి ఒక్క వాగ్దానం కూడా అమలుపరచలేదని విమర్శించినారు. నేట్టేరి జగనన్న సురక్ష కార్యక్రమంలో 200 సర్టిఫికేట్‌లను మంత్రి ఆర్‌కె రోజా చేతుల మీదగా అందజేసారు. యంపిపి దీపాజలంధర్‌రాజు, తహశీల్దారు అమరేంద్రబాబు యంపిడిఓ అరుణ, సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణరెడ్డి, మండల వైకాపా కన్వీనర్ వేణురాజు, వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, కో ఆప్షన్ మెంబరు అనిల్‌కుమార్, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, సచివాలయ కన్వీనర్ గోపిక్రిష్ణ, హేమాద్రి, మహేష్, మేరీజయరామ్, వీరయ్య నాయుడు, సత్యరాజ్, రాము, విజేష్, దాము, సత్యరాజ్‌మండలవిద్యాశాఖాధికారి శ్రీధర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు

## భానుప్రకాష్‌ను సన్మానించిన టీడీపీ నాయకులు

వడమాలపేట, జూలై 22 ప్రభాతవార్త:



ఎన్‌టీఆర్ శత జయంతి ఉత్సవాలు, తానా తెలుగు మహాసభలో పాల్గొని అమెరికా పర్యటన ముగించుకుని నియోజకవర్గంకు విచ్చేసిన నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్‌ను వడమాలపేట మండల నాయకులు పూల బొకేలు, శాలువతో ఘనంగా సత్కరించారు. శనివారం భానుప్రకాష్ స్వగృహం వద్ద కలసిన నాయకులు సన్మానించారు. ఆదివారం పాదిరేడు మాతమ్మ కొలువుకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ అధికారి ప్రతినిధి ధనంజయనాయుడు, చిత్తూరు పార్లమెంట్ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రావిళ్ళ మాధవనాయుడు, చిత్తూరు పార్లమెంట్ ముదిరాజు సాధికారిక కన్వీనర్ ఉమాపతిరావు, నగరి నియోజకవర్గ ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మాతయ్య, బాలకృష్ణ, పాదిరేడు నాయకులు రాజా, అశోక్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కార దిశలో భాగమే జగనన్న సురక్ష

పుత్తూరురూరల్, జూలై 22 ప్రభాతవార్త:

పుత్తూరు మండలం కేబీఆర్ పురం సచివాలయలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి రోజా సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు వైసీపీ ముఖ్య నాయకులు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ జగనన్న లాంటి ముఖ్యమంత్రి మనకు దొరకడం మన రాష్ట్ర ప్రజలు చేసుకున్న గొప్ప పుణ్యమని తెలియజేశారు. అనంతరం కేబీఆర్ పురం గ్రామంలో దాదాపు 434 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, పుత్తూరు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పుత్తూరు రూరల్ సచివాలయ కన్వీనర్ భాస్కర్‌యాదవ్, ఎంపీడీవో ఇందిరమ్మ, నాయకులు నరసింహులు, బుజ్జి, అన్నా లోకనాథం, చిరంజీవి, అధికారులు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాలో 32 మంది ఉద్యోగాలకు ఎంపిక

పుత్తూరురూరల్, జూలై 22 ప్రభాతవార్త:



పుత్తూరు మున్సిపాలిటీ గోవిందపాళెంలోని శ్రీ విద్యా డిగ్రీ, ఎంబీఏ కళాశాలల్లో శనివారం మాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారు జావా డెవలప్‌మెంట్, ఐసీఐసీఐ బ్యాంకు ఉద్యోగాలకు నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 115 మందిపాల్గొన్నారు. వివిధ దశలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎక్స్‌నెక్షర్‌కు 20 మంది, ఐసీఐసీఐ బ్యాంకుకు 12 మంది అభ్యర్థులు నియామకం చెందినట్టు తెలియజేశారు. ఈ జాబ్‌మేళాలో కంపెనీల హెచ్‌ఆర్ మేనేజర్లు ఎన్నికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో శ్రీ విద్యా కళాశాల చైర్మన్ జి.ఉమామహేశ్వర్ మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి ఏటా అనేక జాబ్‌మేళాల ద్వారా తమ కళాశాల విద్యార్థులకే కాకుండా అనేక మంది నిరుద్యోగ యువతి, యువకులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మాణిక్యం, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ డా.రవివర్మ, అధ్యాపకులుపాల్గొనిఉద్యోగాలకుఎన్నికైనఅభ్యర్థులను అభినందించారు.

## నేటి నుండి మహతిలో నాటక,నృత్య పోటీలు

-అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బిఎన్.రెడ్డి వెల్లడి



**తిరుపతి ప్రెస్‌క్లబ్,జూలై 22 ప్రభాతవార్త:** నేడు 23వ తేదీ ఆదివారం నుండి 30వ తేదీ వరకు స్థానిక మహతి కళాక్షేత్రం నందు ఉదయం 10 నుండి రాత్రి 9 గంటల వరకు వివిధ పౌరాణిక పద్య నాటకాలు, సందేశాత్మక సాంఘిక నాటికలు, అలాగే కూచిపూడి, భరతనాట్యం మరియు జానపద బృంద నృత్య పోటీలను తిరుపతి అభినయ ఆర్ట్స్ హనుమ అవార్డ్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడునని అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బిఎన్.రెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 23వ తేదీ మధ్యాహ్నం 3-30 గంటలకు బాపట్ల శ్రీ విఘ్నేశ్వర నవ్యనాటక కళాసమితి వారిచే మహావీర ధనుంజయ నాటకం, రాత్రి 7-30 నుండి 9 గంటల వరకు తెనాలి డిఎల్.కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్ వారిచే 'ది లెసన్' సాంఘిక నాటిక, 24వ తేదీ మధ్యాహ్నం టివిఆర్ థియేటర్స్, హైదరాబాద్ వారిచే శ్రీ స్వామి అయ్యప్ప పద్య నాటకం, రాత్రి వీరన్నపాలెం కళానికేతన్ వారిచే స్థిరాస్తి సాంఘిక నాటిక, 25వ తేదీ మధ్యాహ్నం వరంగల్లు వారిచే విజయా నిరుద్ధం పద్య నాటకం, రాత్రి నెల్లూరు వారిచే మోచేతి కంకణం సాంఘిక నాటిక, 26వ తేదీ మధ్యాహ్నం శ్రీకృష్ణకర్ణార్జునియం పద్య నాటకం, రాత్రి అమలాపురం వారిచే 'స్వీకారం' సాంఘిక నాటిక, 27వ తేదీ మధ్యాహ్నం కాకినాడ వారిచే నర్తనశాల పద్యనాటకం, రాత్రి గుంటూరు వారిచే 'మృత్యుంజయుడు' సాంఘిక నాటిక, 28వ తేదీ మధ్యాహ్నం హైదరాబాద్ వారిచే 'వసంత రాజీయం' పద్యనాటిక, రాత్రి గుంటూరు వారిచే 'నాన్నా నేనొచ్చేస్తా' సాంఘిక నాటిక, 29వ తేదీ మధ్యాహ్నం 'మాధవ వర్మ' పద్యనాటకం, రాత్రి ఏలూరు వారిచే 'మనసున మనసై' సాంఘిక నాటిక, ఆఖరి రోజైన 30వ తేదీ మధ్యాహ్నం తిరుపతి వారి గంగమ్మ నాటక ప్రదర్శనతో పోటీలు ముగుస్తాయని, అదే రోజు రాత్రి పోటీలలో విజేతలైన వారికి బహుమతులు ప్రదానం ఉంటుందని ఆయన వివరించారు. ప్రతి రోజూ ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1-45 గంటల వరకు కూచిపూడి, భరతనాట్యం మరియు జానపద బృంద నృత్యాలు 240 నృత్య ప్రదర్శనలు ఈ పోటీలలో పాల్గొంటాయి కాబట్టి..తిరుపతి పుర ప్రజలే కాకుండా, పరిసర ప్రాంతాల ప్రజలు కూడా విచ్చేసి తమ ప్రదర్శనలను తిలకించి ఆనంద పరవశులు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భాగంగా మబ్బు సూర్యనారాయణరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు, కళ్ళు, చెవి పరీక్షలతో పాటు వినికిడి యంత్రాలను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో మబ్బు సూర్యనారాయణరెడ్డి, ఎన్.విశ్వనాథరెడ్డి, మిఇమక్రి విజయ్‌కుమార్, ఇరమున్ని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌పై దాని ప్రభావం

అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్

**తిరుపతి(విద్య), జులై 22, ప్రభాతవార్త** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌పై దాని ప్రభావం అనే అంశం పై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌కు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని అధ్యక్షత వహించారు. వర్క్‌షాప్‌లో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. భారతి శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయంలోని టిఓసిఐసి కేంద్రం యొక్క లక్ష్యాలు, విజయం గురించి పంచుకున్నారు. కీ నోట్ స్పీకర్ డాక్టర్ రామానుజ్ జెనరేజీ. న్యూ ఢిల్లీలోని డిఎస్ఐఆర్ మద్దతుతో పిఆర్ఐఎస్ఎం పథకం ద్వారా అందించబడిన ప్రయోజనాలు, అవకాశాలను న్యూ ఢిల్లీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ సైంటిఫిక్ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిస్ట్ ఎఫ్, సభ్య కార్యదర్శి వివరించారు. వర్క్‌షాప్ సందర్భంగా, ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని ప్రొఫెసర్ రింటు బెనర్జీ తన ఇన్నోవేషన్ ప్రయాణం, ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతికత బదిలీ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు నిధుల అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ పరిశోధనలను ఎపిసిఎస్‌హెచ్ఇ వైస్ చైర్ పర్సన్ ప్రొఫెసర్ పి. ఉమా మహేశ్వరి దేవి కోరారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో టిఓసిఐసి సెంటర్ కోఆర్డినేటర్, ప్రొఫెసర్ పి. జ్యోత్స్న, కోఆర్డినేటర్ డాక్టర్ డి. సుజాత ఆధ్వర్యంలో వర్క్ షాపు నిర్వహించారు.

## స్విమ్స్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్సు

**తిరుపతి టౌన్, జులై 22, ప్రభాతవార్త** శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ స్విమ్స్‌లో జులై 25వ తేది ఉదయం 8 గంటల నుంచి 29వ తేది వరకు ఇండియన్ చాప్టర్ ఆఫ్ ఇంటర్నేషనల్ హెపటో పాంక్రియేటో బిలియరి అసోసియేషన్, స్విమ్స్ గ్యాస్ట్రో ఎంట్రోయాలజీ విభాగాధిపతి డాక్టర్. వెంకటరామిరెడ్డి వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారత దేశం నలుమూలల నుండి 50 మందికి పైగా నిష్ణాతులైన గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణులు, ఎంపిక కాబడిన 100 మందికి పైగా పిజి వైద్య విద్యార్థులు పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి సంబంధించిన అత్యాధునిక వైద్య పద్ధతులు, ఆపరేషన్లు వివిధ విధానాలపై ఇంటరేటివ్ టీచింగ్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

# కుప్పం తెలుగుదేశం పార్టీలో సంస్థాగత పదవుల జాతర

**- పార్టీ విస్తరణ.. కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక విభాగాలు !!**



కుప్పం, జూలై 22 ప్రభాతవార్త : తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి సంబంధించి పెద్ద ఎత్తున సంస్థాగత పదవులను భర్తీ చేస్తూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పార్టీని నియోజకవర్గంలో మరింత బలోపేతం చేసేదిశగా పార్టీలో విస్తరణ విభాగం, కార్యకర్తల సంక్షేమం కోసం సంక్షేమ విభాగంను కొత్తగా ఏర్పాటుచేశారు. ఈ విభాగాలతో పాటు పలువురికి రా ష్ట్రస్థాయిలో పదవులు కేటాయించారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, పార్టీ విస్తరణ విభాగం కన్వీనర్‌గా డా॥ బిఆర్ సురేష్‌బాబును నియమించారు. అలాగే నియోజకవర్గ కార్యకర్తల సంక్షేమ విభాగం కన్వీనర్‌గా డిఎస్ త్రిలోక్‌ను నియమించారు. తెలుగుయువత మాజీ అధ్యక్షుడు చెక్కునత్తం మణిని రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించారు. రామకుప్పంకు చెందిన గిరిబాబు నాయక్‌ను ఐటిడిపి విభాగం ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించారు. ఇక పార్టీ విస్తరణ విభాగంలో కె.కన్నన్, ప్రతాప్, వెంకటరమణ(బాబు), ఎం.మంజునాథ్, భాస్కర్, రాజారాం, బాబు, చిన్నతంబి, రామచంద్రలను సభ్యులుగా నియమించారు. అలాగే కార్యకర్తల సంక్షేమ విభాగంలో వెంకటరమణ (నాను), సింగిరి శ్రీనివాసులు, శకుంతల, డికె చంద్రశేఖర్, రామన్న, త్యాగరాజు, గని ఉల్లా, ఉయ్యాలజయరాంరెడ్డిలను సభ్యులుగా నియమించారు. కుప్పం నియోజకవర్గంలో ఈసారి ఎన్నికల్లో తెదేపా అధినేత చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధనే ధ్యేయంగా ఇదివరకే పార్టీ శ్రేణులు కార్యాచరణ రూపొందించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పార్టీలో పదవుల కేటాయింపు సైతం పెద్ద ఎత్తున చేపట్టడం పట్ల దేశం శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సుందరీకరణ పనులను వేగవంతం చేయండి

**కమిషనర్ హరిత**



తిరుపతి కార్పొరేషన్, జులై 22 ప్రభాతవార్త : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇటీవల ఫ్రీ లెఫ్టుల వద్ద చేపట్టిన సుందరీకరణ పనులను శనివారం పరిశీలిస్తూ ఫ్రీ లెఫ్టులను పూర్తి చేసేందుకు పనులను వేగవంతం చేయాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. తిరుపతి లీలామహల్ కూడలి వద్ద ఏర్పాటు చేస్తున్న జింకల ప్రతిమలను పరిశీలిస్తూ ప్రజలు రహదారులపై ప్రయాణించేటప్పుడు ఆహ్లాదకరంగా, అందంగా వుండేలా ప్రతిమలను, పరికరాలను, ప్రతి కూడల్లో, శ్రీనివాస సేతు క్రింద అటు, ఇటు రోడ్లకి మధ్య భాగంలో అమర్చడం, గ్రీనరీని పెంపొందించడం చేయాలన్నారు. లీలామహల్ సర్కిల్ ప్రాంతంలో పనులు జరుగుతున్న ఫుట్ పాత్‌లను పరిశీలిస్తూ ఫుట్ పాత్ నిర్మాణాలు చక్కగా వుండాలని సూచిస్తూ, ఓపెన్ కాలువలపై గ్రిల్స్ వేసి చెత్తా, చెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బాలాజీ కాలనీ సర్కిల్ వద్ద మ్యూజిక్ కళాశాల ఫ్రీ లెఫ్ట్ వద్ద ఏర్పాటు చేసిన సంగీత వాయిద్య పరికరాలను పరిశీలిస్తూ, మనస్సుకు ఆహ్లాద పరిచే సంగీత వాయిద్య పరికరాలు అనువైన స్థలంలో అమర్చాలన్నారు. టౌన్ క్లబ్ సర్కిల్ వద్ద జరుగుతున్న ఫ్రీ లెఫ్ట్ పనులను పరిశీలిస్తూ, తిరుమల గాలి గోపురం, మాల్వాడి గుండం ప్రతిబింబించేలా గీయిస్తున్న అతి పెద్ద చిత్రాన్ని పరిశీలించి, పనులను త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈ రవీంద్ర రెడ్డి, ఆప్కాన్ సంస్థ ప్రతినిధి రంగస్వామి పాల్గొన్నారు

## స్విమ్స్‌లో ఆరోగ్య శ్రీ రోగులకు అన్యాయం చేస్తున్న డైరెక్టర్

**స్విమ్స్ ఆసుపత్రి నందు రోగుల ఆందోళనకు మద్దతు తెలిపిన సిపిఎం**




తిరుపతి టౌన్, జులై 22 ప్రభాతవార్త : రాయలసీమ జిల్లాలకు వైద్యానికి కేంద్రంగా ఉన్న స్విమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ నిర్ణయాల వల్ల పేద రోగులకు తీవ్రమైన ఇబ్బంది, నష్టం కలుగుతున్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ రోగుల నుంచి డబ్బు చెల్లించాలని ఆయా విభాగాల డాక్టర్లు, అధిపతులు రోగులను ఇబ్బంది పెడుతున్నారు. ఈ విషయంగా స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌ని సంప్రదించగా ఆయన కూడా పై అధికారుల నిబంధనల మేరకే ఇది చేస్తున్నామని తెలిపారన్నారు. గతంలో ఈ విధంగా చేయడం లేదు కదా అని అడగగా అది వాస్తవమని తెలిపారు. కొత్త నిబంధన ప్రకారమే రోగుల నుండి డబ్బు చెల్లించమని అడుగుతున్నామని తెలియజేసారు. ఈ సమాధానానికి విసుగు చెందిన రోగులు ఎమర్జెన్సీ వద్ద ధర్నాకు పూనుకున్నారు. ఈ ధర్నాకు సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు మద్దతు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని చెప్పే టిటిడిలో బలవంతపు వసూళ్ళు చేపట్టడం దారుణమని తెలిపారు. గతంలో డాక్టర్ రంగమ్మ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు ఇటువంటివి జరగలేదని, కొత్తగా టిటిడి జేఈవో సదాభార్గవి, డైరెక్టర్‌గా చేపట్టిన తర్వాత ఇటువంటి వసూళ్ళు చేపట్టడం అన్యాయం అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న దానిపై ఆరోగ్య అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. రేపటి నుంచి ఆరోగ్య శ్రీ నిబంధనలు ప్రకారం వైద్యం అందించకపోతే అన్ని పక్షాలుగా కలిసి ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ ధర్నాలో అనేక మంది రోగులు వారి బంధువులు నర్సింహులు, కొండయ్య, రెడ్డెప్ప, వెంకటరమణ, వెంకటయ్య పాల్గొన్నారు. మొదట్లో చేర్చుకునేటప్పుడు డబ్బు చెల్లించమని చెప్పలేదని, చెప్పకుండా ఆరోగ్యశ్రీ అని చెప్పి చేర్చుకున్న తర్వాత ఇటువంటి పాటించడం ఇబ్బందిగా ఉందని తెలిపారు.

## రైలు నుంచి పడి వ్యక్తి మృతి



శ్రీకాళహస్తిరూరల్,జూలై 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి రేణిగుంట రైల్వే మార్గంలోని కొత్త కండ్రిగ గ్రామం సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి శవంను గుర్తించారు.శనివారం శ్రీకాళహస్తి రైల్వే పోలీసు హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు అందించిన సమాచారంమేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆ వ్యక్తి బహుశా రైలు నుంచి జారి పడి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. రైలులో పయనిస్తూన్న ప్రయాణీకుడు ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసునురేణిగుంట రైల్వే ఎస్ఐ రవి నేతృత్వంలో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. సంఘటనా స్థలం వద్ద స్టేట్‌బ్యాంకు ఎటిఎం లభించినట్లు వివరంచారు.దాని మీద ప్రమోద్ అనే పేరు ఉందని బహుశా చనిపోయిన వ్యక్తి ప్రమోద్ అయి ఉండవచ్చునని భావిస్తున్నట్లు వివరించారు. కేసు విచారణలో ఉందన్నారు.

## నేతన్నలపై జగన్ నీతిలేని రాజకీయం : షణ్ముగరెడ్డి

పుత్తూరు, జూలై 22 ప్రభాతవార్త: కాళ్లు, చేతులు నరికేసి బటన్ నొక్కి డబ్బులు వేస్తా ప్రశాంతంగా బతికేయ్ అన్నట్టుంది నేతన్న విషయంలో జగన్మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న వైఖరి. ఈ సందర్భంగా టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి మాట్లాడుతూ నిన్న వెంకటగిరికి వెళ్లి మరీ జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కాడు దానికి నేతన్న నేస్తం అని పేరు పెట్టాడని, ఇచ్చిన ప్రకటనలో నేతన్న నేస్తం, పెన్షన్, ఆప్కో బకాయిలు, పెన్షన్, రేషన్ రైతు భరోసా, ఆసరా, తోడు దీవెన అంటూ సుమారు 20 కోట్ల వ్యయంతో భారీ ప్రకటన ఇచ్చి జగన్మోహన్‌రెడ్డి పార్టీ జెండాను, సొంత పత్రికకు ఆర్థికంగా లాభం చేకూర్చడం తప్ప నేతన్నకు ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు. చేనేతలకు పెన్షన్ అందించే పథకానికి శ్రీకారం చుట్టింది తెలుగుదేశం పార్టీయేనని తెలిపారు. అదే సమయంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏమి చేయలేదని అబూత కల్పనకు తెరలేపడం సిగ్గు చేటని తెలియజేశారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో వర్షాకాల భృతిగా నెలకు 8 వేలు చొప్పున రెండు నెలల పాటు సుమారు లక్ష మందికిపైగా అందించారని, ఆ పథకం పేరు మార్చి ఆ ఘనతను తన ఖాతాలో వేసుకున్నారని ఆరోపించారు. మరమగ్గాలకు 50 శాతం రాయితీ కోసం రూ.80 కోట్లు ఖర్చు చేశారని, 1.11 లక్షల మంది చేనేత కార్మికులకు రెండు వేలు రూపాయలు చొప్పున పెన్షన్ ఇచ్చి చేనేతలకు చేయూతనిచ్చినటువంటి నాయకుడు చంద్రబాబు మాత్రమేనని తెలియజేశారు.

## రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం, వీడ్కోలు



రేణిగుంట, జూలై 22 ప్రభాతవార్త: ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవంలో కులపతి హోదాలో ముఖ్య అతిథిగా పాల్గొనుటకు శనివారం ఉదయం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం లభించింది. స్వాగతం పలికిన వారిలో జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పద్మనాభరెడ్డి, లైజన్ ఆఫీసర్ భాస్కర్‌నాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావు, రేణిగుంట తహసీల్దార్ ఉదయ్, సంతోష్, ఏర్పేడు తహసీల్దార్ శివప్రసాద్, రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ తదితరులు ఉన్నారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో తిరుపతి బయలుదేరి వెళ్లారు. ముగించుకుని గవర్నర్ అధికార ప్రతినిధులు వీడ్కోలు పలుకుతుండగా ప్రత్యేక విమానంలో గన్నవరం వెళ్లారు.

## నలగాంపల్లెలో వైకాపా,టీడీపీ వర్గీయుల ఘర్షణ

బంగారుపాళ్యం, జూలై 22 ప్రభాతవార్త: మండలంలోని నలగాంపల్లె గ్రామంలో శుక్రవారం రాత్రి వైకాపా,టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరు వర్గీయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 10 మందిపై రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. రాజకీయ నేపథ్యంలో టీడీపీకి చెందిన దినకర్‌పై వైపాపా వర్గీయులు విజయ్‌కుమార్, వెంకట రమణ,పాండు, దరణీకుమార్, జేమ్స్‌లు దాడి చేశారు. అలాగే వైకాపాకు చెందిన వెంకట రమణపై టీడీపీకి చెందిన దినకర్,చిట్టిబాబు, స్టాలిన్, శరత్‌కుమార్, నితిన్‌లు దాడిచేశారు. ఇరువర్గాలపై సీఐ నాగరాజారావు కేసులు నమోదు చేశారు. ఈఘర్షణలో రాజకీయ నేపథ్యంతో జరిగాయి. గాయపడిన టీడీపీ కార్యకర్త దినకర్‌ను పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ మురళీమోహన్ నలగాంపల్లెలో పరామర్శించారు.పార్టీ పరంగా అండగా వుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులలో మాట్లాడుతూ వైకాపా నాయకులు అధికార బలంలో టీడీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి ఈదాడులు, కేసుల విషయమై సీఐ నాగరాజారావుతో చర్చించారు.

## వ్యవసాయ కళాశాలలో ఘనంగా వన మహోత్సవం

తిరుపతిరూరల్, జూలై22 ప్రభాతవార్త: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉప కులపతి డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి బత్తాయి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో బత్తాయి తోటల పెంపకాన్ని ప్రారంభించడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డాక్టర్ రమణ, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ రెడ్డి శేఖర్, డాక్టర్ సరళ, డాక్టర్ వాణి, డాక్టర్ సంతోష్, డాక్టర్ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## గున్నం సేవా ట్రస్ట్ దాతృత్వం

- పాఠశాలకు రూ.12 లక్షలు విలువైన సామగ్రి వితరణ



ఓజిలి, జూలై 22 ప్రభాతవార్త : ఓజిలి మండలం ఆరిమేనుపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు భట్లకనుపూరు గ్రామానికి చెందిన గున్నం సేవాట్రస్ట్ ఛైర్మన్ గున్నంరెడ్డి రాధారెడ్డి, గున్నంరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో దాతృత్వం చాటుకున్నారు. గున్నం సేవా ట్రస్ట్ ఛైర్మన్ గున్నంరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతుల మీదుగా సుమారు రూ.12 లక్షల విలువైన ల్యాబ్ పరికరాలు, విద్యార్థులు ఆడుకోవడానికి క్రీడా పరికరాలు, పాఠశాల ప్రహరీకి సంబంధించిన ఇతర సామగ్రి పాఠశాలకు వితరణ చేశారు. సైన్స్ ల్యాబ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. ఎమ్మెల్యే సంజీవయ్య మాట్లాడుతూ గున్నం సేవా ట్రస్ట్ ప్రారంభించినప్పటి నుంచి ఆపద కాలంలో ఎవరు వచ్చినా సేవ చేస్తున్నారని అభినందించారు. గున్నం సేవా ట్రస్ట్ సేవలు మరువలేనివని, మండలంలో అభివృద్ధి పనులకు సాయం అందిస్తున్నారని ఆయన అన్నారు. గున్నం సేవా ట్రస్ట్ ఛైర్మన్ గున్నంరెడ్డి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు గుంటమడుగు రవీంద్రరాజు, కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్, తహశీల్దార్ డి.లాజరస్, ఎంపిడిఓ రజనీకాంత్, నాయుడుపేట సీఐ వైవి సోమయ్య, ఓజిలి ఎస్ఐ డి.ఆదిలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు గుంటమడుగు రఘురామరాజు, ఓజిలి ఎంఇఓ శైలజ, సుకుమార్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పాదర్తి హరినాథరెడ్డి, దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకుడు బచ్చల రవీంద్రారెడ్డి, గుంటమడుగు వామన్‌రాజు, కొండూరు ప్రభాకర్‌రాజు, ఎంఇఓ చంద్రశేఖర్, అధికారులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగా ప్రకటించిన సిఎంకి ధన్యవాదాలు

**- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



వెంకటగిరి, జులై 22 ప్రభాతవార్త: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా, ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులకు నిధులు మంజూరు చేసినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి శతకోటి వందనాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులను కూడా మొదలుపెడతామని చెప్పారు. అక్టోబర్ నెలలో పోలేరమ్మ జాతర ఉందని ఈ లోపల రాష్ట్ర పండుగ గుర్తించే ఉత్తరాలు తీసుకొని వస్తామని తెలిపారు. పెద్దలు రాజాల సూచనలు, సలహాలు తీసుకుంటూ ముందుకుపోతానని తెలిపారు. పోలేరమ్మ జాతరను గతంలో ఉన్న వారు రాష్ట్ర పండుగ చేస్తామని ఇచ్చిన హామీలు ప్రకటనకు పరిమితం అయ్యాయనాన్నారు. లక్షలాది మంది రైతులకు ఉపయోగపడే ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను స్వార్థం కోసం నిలిపివేశారన్నారు. వెంకటగిరి అభివృద్ధి పైనే నా దృష్టంతా ఉంటుందన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేసినందుకు సహాయపడిన అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. సమావేశంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్క వెంకటేశ్వరరావు, వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి హరికృష్ణ, వైస్‌చైర్మన్ బాలయ్య, వైసీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, నాయకులు ప్రసాద్‌రెడ్డి, మురళీకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచెంగాళమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి



సూళ్లూరుపేట, జులై 22 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరి దేవిని రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఎవి శేషసాయి శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన శేషసాయి దంపతులకు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్, జిల్లా జడ్జి యామిని, ట్రస్టుబోర్డు సభ్యులు ఓలేటి బాలసత్యనారాయణ, ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు బైరి పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తొలకరి పలకరింత

కోట,మార్చి 22 ప్రభాతవార్త : తొలకరి వర్షం పలకరించడంతో రైతున్నలు పులకించిపోతున్నారు. నైరుతు పవనాలు ఆలస్యంగా ప్రవేశించిన నేటి వరకు కోట మండలంలో ఆశించిని స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో ఆడపాదడపా కరుస్తున్న సన్నని జల్లులకు రైతులు తమ పోల్లాలోను దుక్క దున్నుకొని వర్షం కొరకు ఎదురుచూడటం రైతుల వంతైంది.బంగాళఖాతంలో ఏర్పడి అల్పపీడనం ప్రభావం వలన మరో మూడు నాలుగు రోజులు పాటు భారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావారణ శాఖ అధికారులు తెలపడంతో రైతు ముఖలల్లో ఆనందం కనబడుతోంది.శనివారం సాయంత్రం నుంచి కోట మండలంలో తెలికపాటే వర్షం కరిసింది.ఇటివల వరి నాట్లు వేసిన రైతులకు ఈవర్షం ప్రాణం పోసినట్లుయింది.

## అభివృద్ధి మా అజెండా:బొజ్జల సుధీర్‌రెడ్డి



ఏర్పేడు (శ్రీకాళహస్తి రూరల్),జూలై 22 ప్రభాతవార్త : అభివృద్ధియే అజెండాగా ప్రజాస ంక్షేమమే లక్ష్యంగా తెలుగుదేశం నాయకులు నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ మినీ మెనిఫేస్టోను రూపొందించిందని బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పేడు మండలం చింతల పాళెం గ్రామంలో ఇంటింటికి మీ బొజ్జల: ఒక్కసారి ఆశీర్వదించండి అంటూ ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేసారు. చింతపాలెం వాసులకు గతంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అందించిన సేవలు,అలాగే గ్రామాభివృద్ధికి నిధులు విడుదల చేసిన అంశాలను ప్రస్తావిస్తూ ముందుకు సాగారు. నాడు అభివృద్ధియే లక్ష్యంగా పని చేసామని నేడు ఆదాయమే లక్ష్యంగా పరిపాలన సాగుతుందని వివరించారు.మహిళా శక్తి పథకాలను రూపొందించి శాశ్వత ఆర్థిక వెసులుబాటును అందిస్తున్నారన్నారు. బిసిలకు ప్రత్యేక పథకాన్ని అందిస్తున్నామన్నారు. అలాగే రైతులకు సంబంధించి ఆదుకొనుటకు అభివృద్ధి పథకాలను రూపొందించి అమలుకు మినీ మెనిఫేస్టోలను రూపొందించి అమలుకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. అలాగే గతంలో చింతల పాళెం అభివృద్ధికి ఎస్ ఎస్ కెనాల్‌ను రూపొందించిన ఘనత బొజ్జల గోపాలకృష్ణారెడ్డితే అన్నారు. ఈకార్యక్రమాల్లో పార్లమెంటరీ అధ్యక్షులు నరసింహాయాదవ్,రాష్ట్ర కార్యదర్శి క్లస్టర్ ఇన్‌చార్జి రెడ్డివారి గురువారెడ్డి, మండల సీనియర్ నాయకుడు ధనంజయులు నాయుడు, శివశంకర్‌రెడ్డి రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు,దశరధాచ్చారి, క్లస్టర్ ఇన్‌చార్జిలు రంగనేని చెంచయ్యనాయుడు,నాగరాజు నాయుడుపార్టీ నాయకులు మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు తాటిపర్తి రవీంద్రనాద్‌రెడ్డి, పాపిరెడ్డి,తాటిపర్తి ఈశ్వరరెడ్డి, మిన్నల్ రవి తదితరులు పాల్గొన్నారు.

## లేపాక్షి ఎంపోరియాల ఆదాయం రూ.100కోట్లు అంచనా

**-తిరుమల లేపాక్షి ఎంపోరియంలో చైర్ పర్సన్ విజయలక్ష్మి**




తిరుమల,జులై 22ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలోని అన్ని లేపాక్షి ఎంపోరియాల ద్వారా ఈ ఏడాది ఆర్థికసంవత్సరానికి 100కోట్ల రూపాయలు ఆదాయం సమకూర్చునేదిశగా అంచనా వేసినట్లు రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి తెలిపారు. తిరుమలలో ఉన్న లేపాక్షి ఎంపోరియంను మరింతమంది యాత్రికులు సందర్శించేలా, పలు రకాల వస్తువులను, కళంకారీలను, వారికి నచ్చినవాటిని కొనుగోలు చేసేలా తీర్చిదిద్దుతామన్నారు. తిరుమలకు వచ్చిన రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి,రాష్ట్ర బిసిసంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి బడిగించల చంద్రమౌళిలు మూడురోజులు లేపాక్షి ఎంపోరియంను సందర్శించారు. రోజువారీగా వస్తున్న యాత్రికుల సంఖ్య, అమ్మకాలుతదితరవాటిని గమనించారు. లేపాక్షి ఎంపోరియాలను అన్ని విధాలా అభివృద్ధిచేస్తామన్నారు. తిరుమల లేపాక్షి ఎంపోరియం మేనేజర్ బిపి వెంకటేశంతో కలసి ఆప్కోను సందర్శించారు. ఇక్కడ వస్త్రాలను, చేనేత కళాకారులు నేసిన చీరలను ప్రత్యేకంగా పరిశీలించారు.

## మాస్టర్ ప్లాన్ రోడ్లను వేగవంతం చేయండి : కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, జులై 22, ప్రభాతవార్త : తిరుపతి నగరంలో చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను వేగవంతం చేసి ప్రజలకి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు కృషి చేయాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ కార్యాలయంలో శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులతో కమిషనర్ హరిత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే పూర్తి చేసిన అన్నమయ్య మార్గ్, వైఎస్ఆర్ మార్గ్, సామవాయి మార్గ్, చంద్రశేఖర్ మార్గ్, సీతమ్మ మార్గ్ వలన ప్రజలు సౌకర్యవంతంగా, వేగంగా గమ్య స్థానాలకు వెలుతున్నారని గుర్తు చేస్తూ, మిగిలిన మాస్టర్ ప్లాన్ రోడ్లను పూర్తి చేస్తే ప్రజలకు మరింత సౌకర్యవంతంగా అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో పెండింగ్‌లో వున్న టిడిఆర్ బాండ్లు త్వరగా అందజేయాలన్నారు. నిరంతరం అధికారులు పనులపై దృష్టి సారించి, మాస్టర్ ప్లాన్ రోడ్ల పూర్తికి పని చేయాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటి ప్లానర్ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ దేవానంద్, టిపిఓలు, ప్లానింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

**-రెఫర్‌లకు ఫుల్ స్టాప్ పెట్టండి : జిల్లా అధికారుల పరిశీలన**




శ్రీకాళహస్తి,జూలై 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం ఏర్పాటు చేసిన ఏరియా ఆసుపత్రిలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇక్కడకు వచ్చే పేషెంట్లను బయటకు పంపటం తిరుపతికి రెఫర్ చేసే సంప్రదాయానికి స్వస్తి చెప్పాలని తిరుపతి డివిజన్ డెప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సుధారాణి సూచించారు. ఈ నెల 24న జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ప్రజారోగ్య మరియు వైద్యసేవల కార్యక్రమాలను అంచనా వేయటానికి కేరళలోని జనాభాపరిశోధన కేంద్రం నుంచి ప్రతినిధి బృందం వస్తున్నారు.ఈ నేపథ్యంలో ముందస్తు పరిశీలనగా శనివారంజిల్లా అధికారి ఆకస్మికంగా ఆసుపత్రిని తనిఖీ చేసారు.ఈ సందర్భంగా ఆమె పలు అంశాలను పరిశీలించారు. ముఖ్యంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న ఔట్ పేషెంట్ వైద్యసేవలు, రోగ నిర్ధారణ పరీక్షలు, మందుల వితరణ, జననీ సురక్ష,ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన వంటి ఆర్థిక వెసులుబాట్లు, ప్రసూతి సేవలు,కుటుంబనియంత్రణ సేవలు, శస్త్ర చికిత్సలు,శస్త్రచికిత్సలు, ఎన్‌సిడిసిడి హెల్త్ ఐడీలు, అభాకార్యులు హైరిస్క్ గర్భిణిలకు అందిస్తున్న సేవలు తీసుకుంటున్న చర్యల గురించి ఆమె రికార్డులను పరిశీలించారు.ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ప్రవీణ్ సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి పట్టణ ఆరోగ్యకేంద్ర వైద్యాధికారులతో మాట్లాడుతూ కుష్టు వ్యాధి సర్వే, వ్యాధి నిరోధక టాకాల కార్యక్రమాలన్నీ సక్రమంగా జరగాలని,వందశాతం ఫలితాలు సాధించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం ఉంటూ ఫివర్స్ మరియు లార్వా సర్వే సక్రమంగా జరిపి, వ్యాధులకుకారణమైన పరిస్థితులను వార్డు మున్సిపల్ అధికారులకు తెలియజేసి ఎప్పటికప్పుడు పరిష్కరించుకునే రీతిలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆరోగ్యకేంద్ర వైద్యాధికారులు డాక్టర్ మాధవ్, డాక్టర్ బాలుసాయి, డాక్టర్ జావేద్,ఫార్మసి సూపర్‌వైజర్ సురేష్, హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు పాల్గొన్నారు.